బుధవారం
12-04-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 289
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సూరీడు భగ భగ
రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు
బెంబేలెత్తుతున్న ప్రజలు

సూరీడు నిప్పులు చెరుగుతున్నాడు. రాష్ట్రంలో గత రెండు రోజులుగా భానుడి భగభగలు తారస్థాయికి చేరాయి. రాష్ట్రవ్యాప్తంగా రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

8లో

టీడీపీ కేంద్ర కార్యాలయానికి
సీఐడీ

ప్రధాన కార్యదర్శి పేరుతో నోటీసులిచ్చిన అధికారులు
పార్టీ పత్రికలో వార్తలు, ఎడిటర్ గురించి ఆరా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి సీఐడీ అధికారులు నోటీసులు ఇచ్చారు. మంగళవారం టీడీపీ కార్యాలయానికి వచ్చిన సీఐడీ అధికారులు టీడీపీ ప్రధాన కార్యదర్శి పేరుతో నోటీసులు ఇచ్చి వెళ్లారు. పార్టీ అనుబంధ పత్రిక చైతన్య రథంలో వస్తున్న వార్తా కథనాలపై సీఐడీ వివరాలు సేకరించింది. ఇంతకూ చైతన్యరథం పత్రిక ఎడిటర్ ఎవరు? నిర్వహణ ఎవరు చూస్తున్నారు? అంటూ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి ప్రశ్నలు వేశారు. అనంతరం కార్యాలయంలో ఉన్న పార్టీ న్యాయవాది చేతికి నోటీసులు అందజేసి సీఐడీ అధికారులు వెళ్లిపోయారు. చైతన్య రథం పేరుతో టీడీపీ డిజిటల్ మ్యాగజైన్‌ను నడుపుతోంది. రోజూ దాదాపు 24 పేజీలతో వచ్చే ఈ మ్యాగజైన్ ద్వారా టీడీపీకి సంబంధించిన వార్తా విశేషాలను సభ్యులకు చేరవేస్తారు. అలాగే అధికారపక్షం చేస్తున్న అక్రమ వ్యవహారాలపై పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించేందుకు మ్యాగజైన్‌లో కథనాలు ప్రచురిస్తున్నారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గురించి 'అపరిచితుడు' అనే శీర్షికన, "బుగ్గన భూదాహం" అనే ఉపశీర్షికతో కథనం ప్రచురితమయ్యింది. ఇందులో బుగ్గన ఆస్తుల గురించి ప్రచురించారు. 2019 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రిటర్నింగ్ అధికారికి ఇచ్చిన

- మిగతా 2 లో

చలో విజయవాడ
ఉద్రిక్తం

అడుగడుగునా పోలీసుల ఆటంకం
- పూలే విగ్రహం నుంచి నిరసన ప్రదర్శన
- సీపీఐ, దళిత, మైనార్టీ నేతల అరెస్టు
- మానవత్వం మరచిన సీఎం జగన్
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దళితులు, మైనార్టీలపై దాడులను నిరసిస్తూ సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి అధ్వర్యంలో మంగళవారం తలపెట్టిన చలో విజయవాడ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం దగ్గర మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి సీపీఐ, దళిత, మైనార్టీ, ప్రజాసంఘాల నేతలు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం పూలే విగ్రహం నుంచి శాంతియుతంగా ప్రదర్శనతో బయల్దేరగా... ఒక్కసారిగా పోలీసులు రంగంలోకి దిగి ప్రదర్శనను అడ్డుకున్నారు. నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జల్లి విల్సన్, దళిత హక్కుల పోరాటసమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎం.రామకృష్ణ, ఏపీ మైనార్టీ పరిరక్షణ సమితి కన్వీనర్ ఫారూక్ షుబ్లీ, డీహెచ్‌పీఎస్ నాయకుడు కళింగ లక్ష్మణరావు తదితరులను పోలీసులు బలవంతంగా వ్యాన్లలో ఎక్కించారు. వారిని గవర్నరుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు తాడేపల్లిలోని తన ఇంటి నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రానికి బయల్దేరిన రామకృష్ణను పోలీసులు అడ్డుకున్నారు. చలో విజయవాడకు వెళ్లకుండా ఆటంకాలు సృష్టించారు. పోలీసు వలయాన్ని ఛేదించుకొని రామకృష్ణ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్దకు చేరుకున్నారు. రామకృష్ణ సహా సీపీఐ, దళిత, మైనార్టీ, ప్రజాసంఘాల నేతలు అక్కడ కొంతసేపు నిరసనకు దిగారు. జోహార్ జ్యోతిరావు పూలే, జోహార్ బీఆర్ అంబేద్కర్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులను ఖండించాలని నినదించారు.కాగా, చలో విజయవాడకు తరలివస్తున్న అఖిలపక్ష నేతలను పోలీసులు రాత్రి నుంచే ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. గృహ నిర్బంధం చేశారు. కొన్నిచోట్ల అరెస్టులకు పాల్పడ్డారు. రామకృష్ణ మాట్లాడుతూ నాలుగేళ్ల

- మిగతా 2 లో

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు
కేంద్రం కుట్ర

- అదాని కోసమే ఇదంతా
- కేంద్రంపై మంత్రి కేటీఆర్ తీవ్ర విమర్శలు

2లో

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కేంద్రం కుట్ర చేస్తోందని మంత్రి కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయిస్తే ఉద్యోగులు నష్టపోతారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు.

కేంద్రమే నడపలేకపోతే...
రాష్ట్రానికి సాధ్యమా?

- ప్రైవేటీకరణను బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుందా? సమర్థిస్తుందా?
- వ్యతిరేకిస్తే, కేంద్రానికి లేఖ రాయొచ్చు కదా?
- మంత్రి అమర్‌నాథ్ వింత వాదన

2లో

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు మేం వ్యతిరేకమంటూనే పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంగళవారం మీడియా సమావేశంలో విచిత్ర వాదన వినిపించారు.

సీపీఐ చరిత్రను ఈసీ పట్టించుకోలేదు

జాతీయ పార్టీ హోదా రద్దుపై భారత కమ్యూనిస్టు పార్టీ

న్యూఢిల్లీ: జాతీయ హోదాను రద్దు చేసేముందు ఎన్నికల సంఘం(ఈసీ) తమ పార్టీ చరిత్రను పట్టించుకోలేదని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పేర్కొంది. జాతీయ పార్టీ హోదాను రద్దు చేసే ముందు సీపీఐకి ఉన్న ఘనచరిత్రను ఈసీ పరిగణనలోకి తీసుకోవాల్సిందని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం అభిప్రాయపడింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'స్వాతంత్ర్య సమరంలో సీపీఐ పోరాటాన్ని పరిగణనలోకి తీసుకొని ఉండాల్సింది. దేశంలోని పురాతన పార్టీల్లో సీపీఐ ఒకటి. పాన్ ఇండియా ఉనికి సీపీఐకి సొంతం. పార్టీకి ప్రజాదరణ ఉంది. భారత ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకునే ముందు పార్టీకి గల గొప్ప చరిత్రను గుర్తుచేసుకోకపోవడం బాధించింది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సీపీఐ అగ్రభాగాన నిలిచి పోరాడింది. స్వతంత్ర భారతంలో జాతీయ అజెండా రూపకల్పనలోనూ కీలకంగా వ్యవహరించింది. భారతదేశ ప్రజాస్వామిక పరిపాలన బలోపేతానికి ముందు వరుసలో నిలబడింది. దేశం కోసం నిబద్ధతతో పని చేయడాన్ని పార్టీ కొనసాగిస్తోంది. ప్రజల హక్కుల కోసం పోరాడుతూనే ఉంటుంది. జాతీయ పార్టీ హోదాను

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మీడియాపై 'ఫేక్' అస్త్రం

- ఐటీ నిబంధనల్లో కొత్త సవరణలతో పత్రికా స్వేచ్ఛకు కళ్లెం
- వార్తలను నిషేధించే పూర్తి అధికారం కేంద్రానికే
- ఇది రాజ్యాంగ విరుద్ధం-వార్తాసేకరణకు విఘాతం: ఎడిటర్స్ గిల్డ్, ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా భారతదేశం ఉంది కానీ ఇక్కడ పత్రికా స్వేచ్ఛ అధ్వానంగా ఉంది. ప్రపంచ పత్రికాస్వేచ్ఛ సూచీలో 150వ స్థానానికి భారత్ దిగజారింది. అటు స్వతంత్ర మీడియాకు వేధింపులు ఎక్కువయ్యాయి. మీడియా నోరు నొక్కేసే చర్యలు పెరిగాయి. వృత్తిధర్మానికి కట్టుబడకుండా పాత్రికేయులను శిక్షించడానికి అధికార దుర్వినియోగం మితిమీరుతోంది. నిరంకుశత్వం పెరుగుతూ ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛకు ముప్పు వాటిల్లింది. ఇందుకు ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుంది.

బీజేపీ అధికారంలోకి వచ్చాక అధికార దుర్వినియోగానికి అడ్డు-అదుపు లేదు. పాత్రికేయులపై దాడులు పెరిగాయి. పత్రికా స్వేచ్ఛకు కళ్లెం వేసే విధానాలు

- మిగతా 2 లో

రష్యాకు 40 వేల ఈజిప్టు రాకెట్లు?

కైరో: ఉక్రెయిన్‌పై యుద్ధం క్రమంలో రష్యాకు ఈజిప్టు 40 వేల రాకెట్లను రహస్యంగా పంపనున్నట్లు అమెరికా నిఘా నివేదికలు చెబుతున్నట్లు వాషింగ్టన్ పోస్ట్ వెల్లడించింది. ఈజిప్టు సైనిక ఉన్నతాధికారులతో సమావేశమైన ఆ దేశాధ్యక్షుడు అబ్దేల్ ఫతాహ్ ఎల్-సిసీ, ఆర్టిలరీ రౌండ్లు, గౌన్ పౌడర్‌ను రష్యాకు సరఫరా చేయడంపై చర్చించినట్టు పేర్కొంది. పశ్చిమ దేశాల నుంచి ఎటువంటి సమస్య లేకుండా రష్యాకు ఆయుధాల తరలింపు పక్కా ప్రణాళికతో జరగాలని అధికారులను ఆదేశించినట్టు వార్తా నివేదిక పేర్కొంది. ఫిబ్రవరి 17 నాటి అమెరికా నిఘా వర్గాల నివేదికలో ఈ విషయం ఉన్నట్టు వాషింగ్టన్ పోస్ట్ తెలిపింది. ఈ పరిణామం అమెరికా అధికారులను, రాజకీయ నాయకులను దిగ్భ్రాంతికి గురి చేసింది. 'సిసీ రహస్యంగా రష్యా కోసం ఉక్రెయిన్‌లో ఉపయోగించగల రాకెట్లను నిర్మిస్తున్నది నిజమైతే, రెండు దేశాల మధ్య సంబంధాలను తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుంది' అని కనెక్టికట్ జూనియర్ సెనేటర్ క్రిస్ మర్ఫీ వ్యాఖ్యానించారు. జాతీయ భద్రతా మండలి ప్రతినిధి జాన్ కిర్బీ స్పందిస్తూ పత్రాల చెల్లుబాటును నిర్ధారించడానికి నిరాకరించారని ఫాక్స్‌న్యూస్ తెలిపింది. ఈ పరిణామం మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికాలో మిత్రదేశాలలో ఒకటైన ఈజిప్టుతో అమెరికా సంబంధాలను ప్రభావితం చేస్తుంది. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ జనవరి చివరలో కైరోలో ఎల్-సిసీతో సమావేశమయ్యారు. ఆ తర్వాత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ఉక్రెయిన్-రష్యా యుద్ధం వల్ల ఆర్థికంగా ప్రభావితమైన ఈజిప్టుకు అమెరికా తరపున బ్లింకెన్ సంఘీభావం తెలిపారని చెప్పింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ గతేడాది నవంబరులో ఈజిప్టు పర్యటనకు వెళ్లి ఎల్-సిసీతో భేటీ అయ్యారు. గతంలో మాస్కో చేసిన సాయానికి రుణం తీర్చుకోవాలని రష్యాకు సహాయం చేయాలని ఈజిప్టు నిర్ణయించినట్టు సైనిక ఉత్పత్తి విభాగం సహాయ మంత్రి మహమ్మద్ సలా అల్-దిన్ చెప్పినట్టు ఓ అధికారి వెల్లడించారు. కాగా యుద్ధం కారణంగా ఈజిప్టు రష్యన్ గోధుమలపై ఎక్కువగా ఆధారపడుతున్నట్లు రాయిటర్స్ వార్తాసంస్థ నివేదించింది.

రెస్టారెంట్లలో ప్రవేశం లేదు

అఫ్ఘాన్‌లో మహిళలపై మళ్లీ నిషేధం

కాబూల్: అఫ్ఘానిస్తాన్‌లో తాలిబన్లు మరోసారి మహిళలపై ఆంక్షలు విధించనున్నారు. హెరాత్ ప్రావిన్సులోని మహిళలు, కుటుంబాలు.. ఆరు బయట, పచ్చిక బయళ్లున్న రెస్టారెంట్లోకి రావడాన్ని నిషేధించింది. ఇటువంటి చోట్లకు వచ్చినప్పుడు పురుషులు, మహిళలు కలిసిపోతున్నారని, మహిళలు హిజాబ్ ధరించడం లేదని అక్కడి మత పెద్దలు ఫిర్యాదు చేయడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అఫ్ఘానిస్తాన్ అధికారులు తెలిపారు. ఈ నిషేధం హెరాత్ ప్రావిన్సులోని మహిళలు, పురుషులు కలుసుకునే పచ్చిక బయళ్లతో ఉన్న రెస్టారెంట్లు (గార్డెన్ రెస్టారెంట్స్)కు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. అన్ని రెస్టారెంట్లోకి మహిళలు, కుటుంబాలు రావడాన్ని నిషేధించాయని వార్త కథనాలు వచ్చిన నేపథ్యంలో అధికారులు స్పష్టతిచ్చారు. ఇదిలాఉంటే 2021 అఫ్ఘనిస్తాన్‌ను తాలిబన్లు స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి మహిళల పరిస్థితి మరింత దిగజారింది. ఉన్నత పాఠశాలలో చదివే బాలికలు తరగతి గదిలోకి రానివ్వకపోవడం, యూనివర్సిటీలో మహిళలకు నిషేధం విధించడం, ఐక్యరాజ్య సమితిలో చేసే ఉద్యోగాలతో పాటు మరికొన్ని ఉద్యోగాలు చేయనీయకుండా ఆంక్షలు విధించిన విషయం విదితమే. పార్కులు, జిమ్ములకూ వెళ్లకుండా మహిళలను నిషేధించారు.

ఇరాన్, సౌదీ మధ్య విమానాలు పున:ప్రారంభం

రియాద్: ఇరాన్, సౌదీ అరేబియా మధ్య సంబంధాలను చక్కబెట్టేందుకు చైనా మధ్యవర్తిత్వం సత్ఫలితాలిచ్చింది. రెండు దేశాలు విమాన సేవల పున:ప్రారంభానికి అంగీకరించాయి. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ శాఖ ప్రకటించింది. ఇరాన్ ప్రతినిధి బృందం సౌదీ రాజధాని రియాద్‌కు వెళుతుందని, అలాగే సౌదీ నుంచి సాంకేతిక నిపుణుల బృందం ఇరాన్‌లోని సౌదీ రాయబార కార్యాలయాన్ని సందర్శిస్తుందని, వాణిజ్య విమానాల పున:ప్రారంభంపై ప్రతినిధులు చర్చిస్తారని ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి అలీ రెజా ఎనయటి తెలిపారు. ఇరాన్, సౌదీ అరేబియా మధ్య దౌత్య సంబంధాల పునరుద్ధరణతో పాటు రెండు నెలల్లో రాయబార కార్యాలయాలు, దౌత్య కార్యకలాపాలను పున:ప్రారంభించే విషయంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చొరవతో ఒప్పందం కుదిరింది. మార్చి 10న రెండు దేశాలు ఇదే విషయాన్ని ప్రకటించాయి. ఇరాన్ విదేశాంగ మంత్రి హొస్సేన్ అమీర్ అబ్దుల్లా హియాన్, సౌదీ రాజు ఫైసల్ బిన్ ఫర్హాన్ బీజింగ్‌లో సమావేశమై సంయుక్త ప్రకటనపై సంతకం చేసినట్లు మీడియా తెలిపింది.

ఐఎంఎఫ్-ఆర్ఎస్‌టీపై 44 దేశాల ఆసక్తి

వాషింగ్టన్: వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) 40 బిలియన్ డాలర్లతో రూపొందించిన స్వీయసమృద్ధి, సుస్థిర ట్రస్టు (ఆర్ఎస్‌టీ)లో చేరేందుకు 44దేశాలు ఆసక్తిగా ఉన్నట్లు సంస్థ ఎండీ క్రిస్టాలినా జార్జీవా తెలిపారు. ఈ ట్రస్ట్ ఏడాది కిందట ఏర్పాటైంది. పేద దేశాలు స్వీయసమృద్ధి సాధించేలా ఆర్థిక తోడ్పాటు, సుస్థిర విధానాలకు మద్దతివ్వడమే దీని ముఖ్యుద్దేశం. ఉద్గారాలు లేని ప్రపంచం కోసం ట్రిలియన్ల డాలర్ల పెట్టుబడులకు అంతర్జాతీయ సహకారాన్ని పెంచే తక్షణావశ్యకత ఉన్నప్పటికీ ఆర్ఎస్‌టీ ప్రోగ్రామ్‌కు పెరిగిన డిమాండ్‌తో అందుకు తగిన ప్రాధాన్యత లభించడం లేదని ఐఎంఎఫ్ ఎండీ తెలిపారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు స్ప్రింగ్ మీటింగ్స్ వీక్‌లో భాగంగా సోమవారం మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో క్రిస్టాలినా జార్జీవా ఈ వ్యాఖ్యలు చేశారు.

టీడీపీ కేంద్ర కార్యాలయానికి సీఐడీ

(మొదటిపేజీ తరువాయి)

అఫిడవిట్‌ను తీసుకుని ఆస్తులపై కథనం ప్రచురించారంటూ చైతన్య రథంపై కేసు నమోదు చేశారు. మంత్రి బుగ్గనకు అప్రతిష్ఠ కలిగించే విధంగా, గౌరవ మర్యాదలకు భంగం కలిగించారంటూ సెక్షన్లు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఈరోజు టీడీపీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్న సీఐడీ అధికారులు సీఆర్‌పీసీలోని సెక్షన్ 91 కింద నోటీసులు ఇచ్చారు. చైతన్య రథం పత్రిక ఎడిటర్ ఎవరు.. నిర్వహణ ఎవరు చూస్తున్నారు అని.. అలాగే అపరిచితుడు అనే పేరుతో ఈ కథనాన్ని రాసిన రిపోర్టర్ ఎవరు అని, చైతన్య రథం డిజిటల్ మ్యాగజైన్‌కు సంబంధించి ఒరిజినల్ కాపీ అందజేయాలని నోటీసుల్లో పేర్కొన్నారు. మూడు నెలల క్రితమే శీర్షికపై కేసు నమోదు చేసినప్పటికీ ఇప్పుడు నేరుగా టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చి నోటీసులు అందజేయడం గమనార్హం.

చలో విజయవాడ ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

నుంచి దళిత, మైనార్టీలపై హత్యాకాండ కొనసాగుతోందని విమర్శించారు. సీఎం జగన్ సొంత జిల్లా కడపలో జిల్లాస్థాయి అధికారి డాక్టర్ అచ్చెన్నను హత్యచేస్తే...సీఎం బాధిత కుటుంబ సభ్యులను ఫోన్లో సైతం పరామర్శించలేదని మండిపడ్డారు. ఆశ్చర్యమేమంటే డా.అచ్చెన్నకు శవ పంచనామా చేయలేదని, కనీసం కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వలేదని విమర్శించారు. హంతకులతో పోలీసులు కుమ్మక్కయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్ మానవతా విలువలు మరచిపోయారన్నారు. అచ్చెన్న హత్యపై వాస్తవాలు వెలుగులోకి తెచ్చేందుకుగాను సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా వేధింపులకు గురిచేసి, హింసించి ఆయన చనిపోవడానికి వైసీపీ ప్రభుత్వం కారణమైందన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని కొట్టి చంపి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేశాడని, అయినా ఆ ఎమ్మెల్సీకి అధికార పక్షం పూలదండలు వేసిందేగానీ...చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వెలిబుచ్చారు. కర్నూలు జిల్లా ఎర్రవాడలో మైనార్టీ యువతిపై అత్యాచారం, హత్య జరిగిందని, నిందితులు కళ్లెదుట తిరుగుతున్నా చర్యలు శూన్యమన్నారు. నంద్యాలలో అబ్దుల్ సలామ్ కుటుంబ సభ్యులు నలుగురి ఆత్మహత్యకు పోలీసులే కారణమని మండిపడ్డారు. వాటన్నింటిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దళిత, మైనార్టీలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. చలో విజయవాడకు రాకుండా కర్నూలు, కడప, ఉభయగోదావరి, గుంటూరు తదితర జిల్లాల్లో అఖిలపక్ష నేతలను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఫారూక్ షుబ్లీ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రమాణం చేసినప్పటి నుంచి దళిత, మైనార్టీలపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత, మైనార్టీలపై కొనసాగుతున్న దాడులు, హత్యలపై సీఎం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. దాడులను ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేయడం సమంజసం కాదని హితవు పలికారు. అమరావతి బహుజన జేఏసీ నాయకుడు పి.బాలకోటయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో మానవ హక్కులను కాలరాస్తున్నారని, ప్రజాస్వామ్య పరిరక్షణ లేదని మండిపడ్డారు. పూలే, అంబేద్కర్ ఆశయాలతో అధికారం చేపట్టిన సీఎం, మంత్రులు బాధ్యతగా వ్యవహరించకపోవడం విచారకరమన్నారు. నిరసనలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య, ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ అఫ్సర్, అఖిలపక్ష, దళిత, మైనారిటీ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ చరిత్రను ఈసీ పట్టించుకోలేదు

(మొదటిపేజీ తరువాయి)

ఉపసంహరించుకున్నప్పటికీ సీపీఐ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలుస్తుంది. దేశ ప్రజల కోసం నిబద్ధతతో పనిచేస్తుంది. ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పించే విధంగా ఇంద్రజిత్ గుప్తా కమిటీ సిఫార్సు చేసిన విధంగా ఎన్నికల సమగ్ర సంస్కరణలు, దామాషా పద్ధతిలో ఎన్నికల నిర్వహణ, ఎన్నికల బాండ్ల రద్దు, ఎన్నికలకు ప్రభుత్వమే నిధులు సమకూర్చడం వంటి వాటి కోసం పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తుంది' అని ఆ ప్రకటన పేర్కొంది. సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడమే కాకుండా వాటిని అధిగమించే సత్తా సీపీఐకి ఉన్నదని తెలిపింది.

విశాఖ ప్లాంట్ ప్రజల సెంటిమెంట్: సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : విశాఖ స్టీల్ ప్లాంట్ రాష్ట్ర ప్రజల సెంటిమెంట్ అని, ఈ స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకునేందుకుగాను సీఎం జగన్ ప్రధానితోనూ మాట్లాడారని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. స్టీల్ ప్లాంట్‌పై ప్రధానికి సీఎం నిర్మాణాత్మక ప్రతిపాదన చేశారని, క్యాప్టివ్ మైన్స్ కేటాయించాలని కేంద్రాన్ని కోరినట్లు గుర్తు చేశారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కేంద్రం కుట్ర

విశాలాంధ్ర - హైదరాబాద్: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కేంద్రం కుట్ర చేస్తోందని మంత్రి కేటీఆర్ విమర్శించారు. మంగళవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయిస్తే ఉద్యోగులు నష్టపోతారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో బీహెచ్ఇఎల్‌కు నేరుగా అధిక ఆర్డర్లు ఇచ్చిన రాష్ట్రం తెలంగాణ అని మంత్రి పేర్కొన్నారు. బీమా పథకాలన్నీ ఎల్ఐసీకి అప్పగించారని, నష్టాలను ప్రజలకు.. లాభాలను నచ్చినవారికి అప్పగించడం.. కేంద్రం ఆలోచనగా కనిపిస్తోందని మంత్రి కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఎస్ఏఐఎల్ ద్వారా బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటును పరిశీలిస్తామని విభజన చట్టంలో కేంద్రం స్పష్టంగా చెప్పిందని మంత్రి కేటీఆర్ అన్నారు. బయ్యారం, కడపలో ఉక్కు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఎన్నోసార్లు కలిశానని, బైలాదిల్లా నుంచి బయ్యారానికి పైప్‌లైన్ ఖర్చు 50శాతం భరిస్తామని చెప్పామని అన్నారు. 2014 నుంచి బయ్యారం గురించి ప్రశ్నిస్తున్నామని, కేంద్ర మంత్రులను కలిసినా ఎలాంటి కదలిక లేదని మంత్రి కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. బయ్యారం వెనుక ఉన్న కుట్రను గుర్తించలేకపోయామని, 2018 సెప్టెంబర్‌లో అదానీ గ్రూప్ బైలదిల్లా ఐరన్ ఓర్ కంపెనీ పెట్టిందని మంత్రి కేటీఆర్ అన్నారు. బైలదిల్లా నుంచి ఐరన్ ఓర్‌ను గుజరాత్‌లో ని ముంద్రాకు తరలించేలా ప్రణాళిక చేశారని మంత్రి ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కావాలనే నష్టాల్లోకి నెట్టారని, అదానీ కోసమే విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. బైలదిల్లా గనులపై అదానీ, కేంద్ర పెద్దల కన్ను పడిందని, నష్టాలను చూపించి దోస్తులకు చౌకగా విక్రయించడం ప్రధాని మోదీ విధానమని అన్నారు. తెలుగు రాష్ట్రాలపై మోదీ చేస్తున్న కుట్రను.. ఎండగట్టేందుకు బీఆర్ఎస్ కృషి చేస్తోందని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.

పరువు నష్టం దావాకు కూడా సిద్ధమే...

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వెనుక పెద్ద కుట్ర దాగుందన్న నా ఆరోపణలు అబద్ధమైతే పరువునష్టం దావాకు కూడా సిద్ధమేనని మంత్రి కేటీఆర్ అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం కోసం బిడ్డు వేయడంపై బీజేపీ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. విశాఖ ఉక్కు విషయంలో చూపిస్తున్న ఉత్సాహం బయ్యారం విషయంలో ఎందుకు చూపిస్తలేరని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడ్ని అడుగుతున్నా అన్నారు. విషయం పరిజ్ఞానం లేని ఆయనకు చెబితే ఓ బాధ చెప్పకుంటే ఓ బాధ అని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. బయ్యారం నుంచి బైలదిల్లా 150-160 కిలోమీటర్లు, అలాగే బైలదిల్లా నుంచి విశాఖ 600 కిలోమీటర్ల దూరం ఉందని, అదే ముంద్రాకు 1800 కిలోమీటర్లు దూరం ఉందని తెలిపారు. ఇక్కడ ఫీజబుల్ కాదు కానీ తవ్వి 1800 కిలోమీటర్లు తీసుకెళ్తే ఫీజబుల్ ఎట్లయితదని నిలదీశారు. ఇక్కడ ఉండే అజ్ఞాన బీజేపీ నాయకులు అర్థం చేసుకోకపోవచ్చని, అర్థమైనా అదానీ కోసం నోరు మూసుకోవచ్చని అన్నారు. వీళ్లు అర్థం చేసుకోకపోయినా తెలుగు ప్రజలు అర్థం చేసుకోవాలని, వైజాగ్ పొట్టకొడుతున్నది ప్రధాని, అదానీ అని అలాగే బయ్యారం ఎండబెడుతున్నది కూడా ప్రధాని, అదానీయే అన్నారు. ఇది నిర్దిష్టమైన ఆధారాలతో చేస్తున్న ఆరోపణ అని నేను చెప్పిన మాట తప్పయితే పరువు నష్టం దావా వేయండని చెప్పారు.

కేంద్రమే నడపలేకపోతే...

రాష్ట్రానికి సాధ్యమా?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు మేం వ్యతిరేకమంటూనే పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంగళవారం మీడియా సమావేశంలో విచిత్ర వాదన వినిపించారు. కేంద్రం నడపలేని ఒక సంస్థను రాష్ట్ర ప్రభుత్వం నడపగలుగుతుందా? అని ప్రశ్నించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం నడపలేకపోయినప్పుడు, రాష్ట్ర ప్రభుత్వానికి ఎలా సాధ్యమవుతుంది? అందుకే తెలంగాణకు కూడా అది సాధ్యం కాదని తేల్చిచెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్... రాజకీయాల్లో భాగంగా వారు చేసేది చేస్తున్నారు. ఇప్పుడు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మేస్తామని కేంద్రం చెబుతోంది. దాన్ని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. తెలంగాణ ప్రభుత్వం ఇంకా బిడ్‌లో పాల్గొనలేదు. ఒక బృందాన్ని పంపించి, ప్లాంట్ నిర్వహణ సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామని మాత్రమే చెప్పారు. అయితే ఇక్కడ రెండు అంశాలు ఉన్నాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకమా? కాదా? ఒకవేళ ప్రైవేటీకరణకు అనుకూలం అనుకుంటే, ఇలా ప్రైవేటీకరణ చేస్తున్న ప్రతి చోటా తామూ బిడ్‌లో పాల్గొంటామని చెబుతారా? ఒకవేళ అలాంటి ఉద్దేశం, ఆలోచన లేనప్పుడు, ఏ విధంగా ఇప్పుడు బిడ్‌లో పాల్గొంటారనేది వారే చెప్పాలి. ప్రైవేటీకరణ వద్దని మొన్న వారే చెప్పారు. మరి ఈ రోజు బిడ్‌లో పాల్గొంటున్నారంటే... ప్రైవేటీకరణకు వారు అనుకూలంగా ఉన్నట్లే కదా? అందువల్ల ప్రైవేటీకరణకు అనుకూలమా? వ్యతిరేకమా? అన్నదానికి ముందుగా వారు సమాధానం చెప్పాలి. ఒకవేళ తెలంగాణ ప్రభుత్వం ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తే, కేంద్రానికి లేఖ రాయొచ్చు కదా? సంస్థకు క్యాపిటివ్ మైన్స్ ఇవ్వమని కోరవచ్చు కదా? అంటూ తెలంగాణ ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవడానికి ఉన్న అంశాలను సీఎం జగన్, ప్రధాని మోదీకి మూడు, నాలుగు సందర్భాలలో చెప్పారు. క్యాపిటివ్ మైన్స్ ఇవ్వాలని, రుణాలు సేకరించి పునరుద్ధరణ చేయొచ్చని చెప్పాం. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రజల సెంటిమెంట్‌తో కూడుకున్నదని, ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ చేయవద్దని గట్టిగా చెప్పాం. అసెంబ్లీలో తీర్మానం కూడా చేశాం. అలాగే విశాఖలో 4 లక్షల మందితో బహిరంగ సభ ఏర్పాటు చేసి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించాం. ఇది మా విధానం అయితే... అమ్మటం-కొనటం... ఆ పార్టీల విధానాలంటూ బీఆర్ఎస్‌ను విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి కేంద్ర ఆర్థిక శాఖ గత ఏడాది ఏప్రిల్ 19, 2022న మెమో ద్వారా నియమావళి ప్రకటించింది. 51 శాతం, అంతకంటే ఎక్కువ వాటా కలిగి ఉన్న కేంద్ర ప్రభుత్వరంగ సంస్థగానీ, రాష్ట్ర ప్రభుత్వ సంస్థగానీ లేదా సంయుక్త భాగస్వామ్య సంస్థగానీ, మరే ఇతర ప్రభుత్వరంగ సంస్థల (పీఎస్‌యూ) ప్రైవేటీకరణ బిడ్లలో పాల్గొనరాదని కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా చెప్పింది. నిబంధనలు ఇలా ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలకు అంత శక్తే ఉండదని తెలిసినప్పుడు... తెలంగాణ ప్రభుత్వం వచ్చేస్తుందని చెప్పటం ఏమిటి? కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా అనుమతి ఇస్తే తప్ప, అలా పాల్గొనే వీలు లేదని మంత్రి స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవడానికి ఉన్న అవకాశాలన్నింటినీ కేంద్రానికి నివేదించాం. సంస్థను కాపాడుకోవడానికి ఉన్న అన్ని మార్గాలు ఉపయోగించుకుంటాం. ప్రజల్లో ఇంత వ్యతిరేకత ఉన్నా, ఒకవేళ కేంద్రం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మేస్తే, వారు తీవ్ర ప్రజాగ్రహానికి గురికాక తప్పదు. ఎందుకంటే అది ప్రజల సెంటిమెంట్‌తో కూడుకున్నది. ప్రజల సెంటిమెంట్‌ను గౌరవించాల్సిన బాధ్యత కేంద్రంపైన ఉందని మంత్రి అన్నారు.

దేశంలో పేట్రేగిన విద్వేషం, హింస

మోదీ ప్రభుత్వానిది అధికార దుర్వినియోగం

సోనియాగాంధీ విమర్శలు

న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తన అధికారాలను దుర్వినియోగిస్తోందని కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియాగాంధీ విమర్శించారు. దేశంలో విద్వేషం, హింస పేట్రేగిపోతోందని, ఇందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ అండదండలే కారణమని ఓ జాతీయ మీడియా సంస్థకు రాసిన వ్యాసంలో ఆమె వ్యాఖ్యానించారు. నిబంధనలను సవరించి తమకు నచ్చని వార్తలపై చర్యలు తీసుకునేలా చట్టపరమైన అధికారాలను మోదీ ప్రభుత్వం సొంతం చేసుకుందని దుయ్యపట్టారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం భావసారూప్యత కలిగిన పార్టీలతో కలిసి కాంగ్రెస్ ముందుకు సాగుతుందని సోనియా గాంధీ వెల్లడించారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడం శిక్షార్హమైన చర్య కాదని భారత సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల స్పష్టం చేసినా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు.మోదీ హయాంలో పండుగలు మతపరమైన బెదిరింపులకు ఆనవాళ్లుగా మారాయని, మతం, ఆహారం, కులం, లింగం, భాష పేరుతో ప్రజలు వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారత ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలైన శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలను మోదీ పాలన నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ప్రతిపక్షాలపై ప్రధాని తన అధికారాన్ని నేరుగా ప్రదర్శించకపోయినాగానీ ప్రభుత్వ చర్యలు విపక్షాలపై దౌర్జన్యాలను ప్రతిబింబిస్తున్నాయన్నారు. పార్లమెంటులో ప్రసంగాలను బహిష్కరించి, చర్చలను అడ్డుకొని, చివరకు మెరుపు వేగంతో ఒక కాంగ్రెస్ ఎంపీని అనర్హుడిగా ప్రకటించారని రాహుల్‌పై అనర్హత వేటును ఉద్దేశించి సోనియా గాంధీ పేర్కొన్నారు. ఎలాంటి చర్చ లేకుండానే బడ్జెట్‌ను ఆమోదించారని కూడా ఆమె విమర్శించారు. ప్రతిపక్ష నాయకులపై సీబీఐ, ఈడీలను బీజేపీ



ప్రభుత్వం పురిగొల్పుతోందని, ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా 95 శాతం కేసులు నమోదు కాగా బీజేపీలో చేరే వారిపై కేసులు మాత్రం ఆవిరవుతున్నాయన్నారు. చైనా చొరబాటు యత్నాలపై పార్లమెంటులో చర్చ జరగకుండా అధికార పక్షం అడ్డుకుందని, దీనిపై విదేశాంగ శాఖ మంత్రి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సోనియా గాంధీ ఆరోపించారు. త్వరలో అనేక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటాన్ని తన వ్యాసంలో ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీ తమ ప్రతి సందేశాన్ని ప్రజలకు నేరుగా చేరవేస్తుందని, భారత్ జోడో యాత్రలో కూడా అదే చేసిందని సోనియాగాంధీ తెలిపారు.

అవినీతి వ్యతిరేక ఉద్యమం కొనసాగుతుంది

- కాంగ్రెస్ రాజస్థాన్ రాష్ట్ర నాయకుడు సచిన్ పైలట్
- ముగిసిన ఒకరోజు నిరాహార దీక్ష

జైపూర్ : రాజస్థాన్ కాంగ్రెస్ నాయకుడు సచిన్ పైలట్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌పై తాజా యుద్ధానికి తెరతీశారు. ఆయన పార్టీ ఆదేశాన్ని ధిక్కరించి, జైపూర్‌లో మంగళవారం ఒక రోజు నిరాహార దీక్షకు కూర్చున్నారు. రాష్ట్రంలో గత బీజేపీ హయాంలో జరిగిన అవినీతి ఆరోపణలపై సొంత ప్రభుత్వం నుంచి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. షాహీద్ స్మారక్ వద్ద ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిరాహార దీక్షలో కూర్చున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పైలట్ సాయంత్రం దీక్షను విరమించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవినీతికి వ్యతిరేకంగా తన ఉద్యమం కొనసాగుతుందని చెప్పారు. రాష్ట్రంలోని గత బీజేపీ ప్రభుత్వ అవినీతిపై సమర్థవంతమైన చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చామని, ఆ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని ఆయన అన్నారు. 2018లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటి నుంచి పైలట్ రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌తో విభేదిస్తున్నారు. ఏడాది చివరి నాటికి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున, రాష్ట్రంలోని నాయకత్వ సమస్యను ముందుగానే పరిష్కరించాలని పార్టీ అధిష్టానంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నంగా వర్గ విభేదాల మధ్య తాజా తిరుగుబాటు బావుటా ఎగురవేసింది. ఆసక్తికరంగా, నిరసన ప్రదేశంలో కాంగ్రెస్ పేరు, చిహ్నం స్పష్టంగా కనిపించాయి. అధికార పార్టీకి చెందిన ప్రస్తుత ఎమ్మెల్యేలు ఎవరూ సందర్శించనప్పటికీ, మాజీ ఎమ్మెల్యేలు సంతోష్ సహారన్, రాంనారాయణ్ గుర్జార్ సహా అనేక మంది పార్టీ నేతలు వేదిక వద్ద ఉన్నారు. ఇటీవల బ్రిటన్‌లో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను లక్ష్యంగా చేసుకున్న రాజస్థాన్ పర్యాటక శాఖ మంత్రి విశ్వేంద్ర సింగ్ కుమారుడు అనిరుధ్ సింగ్ ధర్నా స్థలంలో ఉన్నారు. పైలట్ నియోజకవర్గం టోంక్, తూర్పు రాజస్థాన్ ప్రాంతాల నుంచి అనేక మంది కార్మికులు కూడా వచ్చారు. పైలట్ నిరసనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ అధిష్టానం స్పష్టమైన హెచ్చరిక జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వంపై అలాంటి చర్య ఏదైనా పార్టీ వ్యతిరేక చర్యగా పరిగణించబడుతుందని తెలిపింది. పైలట్ నిరాహార దీక్షకు ముందు మహాత్మా గాంధీ, సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వసుంధర రాజే నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి ఆరోపణలపై చర్యలు తీసుకోనందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఆదివారం నిరాహార దీక్షకు కూర్చుంటున్నట్లు పైలట్ ప్రకటించారు. 'గత వసుంధర రాజే ప్రభుత్వం చేసిన అవినీతిపై గెహ్లాట్ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేము 45,000 కోట్ల రూపాయల గనుల కుంభకోణంపై విచారణకు హామీ ఇచ్చాము' అని ఆయన అన్నారు. ఇదిలాఉండగా, యువ నాయకుడు ఆదివారం ఆందోళనను ప్రకటించిన తర్వాత గెహ్లాట్ ఎటువంటి ప్రత్యక్ష వ్యాఖ్యను చేయలేదు. అయితే మంగళవారం ఉదయం తన మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్నా ప్రారంభించగానే, రాష్ట్రం కోసం తన స్వంత విజన్‌ను వివరిస్తూ సీఎం వీడియోను విడుదల చేశారు. 2030 నాటికి రాజస్థాన్‌ను అగ్ర రాష్ట్రంగా మార్చాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. 'ఈ కలను సాకారం చేసుకోవడానికి గత నాలుగు బడ్జెట్‌లలో, ఈ సంవత్సరం నేను మరే ఇతర రాష్ట్రం చేయని పథకాలను చేశాను' అని పేర్కొన్నారు.

మీడియాపై 'ఫేక్' అస్త్రం

(మొదటిపేజీ తరువాయి)

పెరిగాయి. గతంలో ఒక్కసారి అదీ ఎమర్జెన్సీ సమయంలో మాత్రమే స్వతంత్ర మీడియా ప్రత్యక్షంగా సెన్సార్‌షిప్‌కు గురైంది. ప్రస్తుతం 'ఫేక్' అస్త్రాన్ని మీడియాపై ప్రయోగించి పత్రికా స్వేచ్ఛను పూర్తిగా హరించి, దానిని నియంత్రించేందుకు కేంద్రప్రభుత్వం నడుంబిగించింది. 'ఫేక్, ఫాల్స్, మిస్‌లీడింగ్' (తప్పుడు-తప్పుదోవ పట్టించే వార్తలు) నెపంతో మీడియా గొంతు నొక్కేసేలా ఐటీ నిబంధనలను తాజాగా సవరించింది. తమకు తాముగా మరిన్ని అధికారాలను కట్టబెట్టుకున్నది. ప్రభుత్వ నియమిత వాస్తవాల పరిశీలన సంఘం (ఫ్యాక్ట్ చెకింగ్ బాడీ)... 'ఫేక్' (తప్పుడు వార్త)గా ముద్రవేస్తే ఎలాంటి వార్తనైనా సంబంధిత వెబ్‌సైట్ నుంచి వెంటనే తొలగించేసే విధంగా జరిగిన తాజా సవరణల ప్రభావం వార్తల సేకరణ, ఇంటర్నెట్ వేదికగా వాక్‌స్వేచ్ఛను తీవ్రస్థాయిలో దెబ్బతీస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తాజా సవరణలపై ది ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా, ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ వంటి సంస్థలు తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తంచేశాయి. తాజాగా తీసుకొచ్చిన సవరణలతో ఏది నిజం, ఏది కాదని నిర్ధారించుకునే అధికారాన్ని ప్రభుత్వం తనకే కట్టుబెట్టుకున్నదని ఎడిటర్స్ గిల్డ్ వ్యాఖ్యానించింది. ఆన్‌లైన్ గేమింగ్, కేంద్రప్రభుత్వానికి సంబంధించిన వార్తాల నియంత్రణ కోసం మధ్యంతర నిబంధనలు-2021ను తమకు అనుకూలంగా ఉండే విధంగా సవరించింది. ప్రభుత్వంపై వార్తల్లో ఏది నిజం ఏది కాదు... ఏది తప్పుదోవ పట్టించేదో నిర్ధారించే అధికారిన్ని ప్రభుత్వ నియమిత సంఘానికి కట్టబెడుతూ కేంద్ర ఐటీ శాఖ పేర్కొంది. సామాజిక మాధ్యమాలు, కంపెనీలు, వెబ్-హోస్టింగ్ వెబ్‌సైట్లలో వచ్చే వార్తలను ఈ సంఘం పరిశీలిస్తుంది. ఏదేని సమాచారాన్ని ఇంటర్నెట్ నుంచి తొలగించాల్సిందిగా ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి దిగ్గజ సంస్థలకు ఆదేశాలిచ్చే అధికారం దీనికి ఉంటుంది.

అయితే తాజా పరిణామానికి రెండు కోణాలు ఉన్నాయి. ఒకటి న్యాయ కోణం. సవరణ చట్టబద్ధతపై ప్రశ్నలు లేవనెత్తడం. ఆన్‌లైన్ కంటెంట్ ప్రామాణికతను, విశ్వసనీయతను నిర్ధారించే అధికారాన్ని కేంద్రప్రభుత్వ శాఖలకు అప్పగించడం అంటే సహజ న్యాయ సిద్ధాంతాలను అతిక్రమించడమే కాకుండా రాజ్యాంగాన్ని ధిక్కరించడమే అవుతుందని డిజిటల్ హక్కుల సంస్థ 'ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్' నొక్కిచెప్పింది. ఇంకొక అంశం ఈ చర్య వెనుక వాస్తవ ఉద్దేశం. వాక్‌స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛకు సంబంధించి కేంద్రప్రభుత్వ రికార్డు ఏమంత గొప్పగా లేదు. ఏదో ఒక విధంగా మీడియా సెన్సార్‌షిప్‌కు నిరంకుశ ప్రభుత్వం యత్నించడం బహిరంగ సత్యం. ప్రత్యక్షంగా ఇంటర్మీడియేటరీస్ (సామాజిక మాధ్యమాలు, సెర్చ్ ఇంజిన్లు, టెలికం- ఇంటర్నెట్ సేవలు అందించేవి, వెబ్‌హోస్టింగ్) పరిధిలోకి రానప్పటికీ తాజా సవరణల ప్రభావం న్యూస్ వెబ్‌సైట్లపై ఎక్కువగానే ఉండనున్నది. 'ఫేక్' అన్న చిన్న పదాన్ని వాడి ఇంటర్నెట్ నుంచి ఎలాంటి వార్తనైనా పూర్తిగా నిషేధించే అధికారం ప్రభుత్వానికి తాజా సవరణాలు కట్టబెట్టాయి. ప్రభుత్వ ప్రకటనల ఆధారిత వార్తలను తప్పుడు లేక తప్పుదోవ పట్టించేవిగా ముద్రవేసే వీలు కలగడం వల్ల పాత్రికేయుల వార్తాసేకరణ ప్రభావితమవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రచురణకర్తలు, జర్నలిస్టులు, కార్యకర్తల భావప్రకటన స్వేచ్ఛపై ఎక్కువ ప్రభావం ఉంటుందని ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ పేర్కొంది. తాజా సవరణలు చట్టబద్ధత ప్రస్తుతం ప్రశ్నార్థకం కాగా అవి చట్టబద్ధమైనవి కాదని నిపుణులు కుండబద్దలు చేస్తున్నారు. సమాచార సాంకేతిక చట్టం పరిధిని పెంచేలా సవరణలు ఉన్నట్లు ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ పేర్కొంది. 'ఫేక్, ఫాల్స్, మిస్‌లీడింగ్' పదాలకు సరైన నిర్వచనమే లేదని వ్యాఖ్యానించింది. అయితే సెక్షన్ 66ఏపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు తాజా సవరణలు విరుద్ధమని ఎడిటర్స్ గిల్డ్ పేర్కొంది. అప్పీలుకు అవకాశం గానీ నిర్దేశిత పద్ధతి కానీ వీటికి లేవని తెలిపింది. 2021 మధ్యంతర ఉత్తర్వులు సుప్రీంకోర్టు పరిశీలనలో ఉండటాన్ని గుర్తుచేసింది. కాగా స్వతంత్ర మీడియాను కట్టడి చేసే విధంగా ఉన్న కొన్ని నిబంధనలపై 2021లో బాంబే, మద్రాస్ హైకోర్టులు తాత్కాలిక స్టే విధించిన విషయం విదితమే.

తెలుగు, సంస్కృత అకాడమీ పేరుతో వెబ్‌సైట్‌లు

ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి

విశాలాంధ్ర-తిరుపతి: తెలుగు, సంస్కృత అకాడమీ పేరుతో వెబ్‌సైట్‌లను అందుబాటులోకి తీసుకువస్తామని ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి తెలిపారు. మంగళవారం స్థానిక తుమ్మలగుంటలోని ఎస్.వి గోశాల ఆవరణలో ఉన్న తెలుగు, సంస్కృత అకాడమీ ప్రాంతీయ కేంద్రంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు అకాడమీ స్థాపించిన తర్వాత పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం జనరల్ స్టడీస్, సైన్స్ అండ్ టెక్నాలజీ పుస్తకాలను ముద్రించడం జరిగిందని, వీటితో పాటు ఏపీ, ఇండియన్ ఎకానమీ పుస్తకాలు కూడా త్వరలో ముద్రిస్తామని తెలిపారు. బీఈడీ సెమ్-1, సెమ్-3 పుస్తకాలు కూడా అందుబాటులోకి వచ్చాయని అన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలితో ఒప్పందం కుదుర్చుకొని త్వరలో డిగ్రీ పుస్తకాలను అందుబాటులోకి తీసుకువస్తామని లక్ష్మీపార్వతి తెలిపారు. తెలుగు మాతృ భాష కాని వారు, తెలుగు రాని వారి కోసం లెర్న్ తెలుగు పుస్తకాలు ఆడియో, వీడియో సీడీలు రూపొందించే దిశగా అకాడమీ కృషి చేస్తోందని అన్నారు. తెలుగు అకాడమీ రూపొందించిన ప్రచురణలను ఈ-కామర్స్ పోర్టల్ ద్వారా హోల్‌సేల్, రిటైల్ సేల్‌లో విక్రయించడానికి ప్రయత్నం జరుగుతుందని అన్నారు. ముద్రించిన పుస్తకాలన్నింటిని తిరుపతి, అనంతపురం, విజయవాడ, గుంటూరు, విశాఖపట్టణం ప్రాంతీయ కేంద్రాల ద్వారా అమ్మకాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి సంవత్సరం మాతృభాషా దినోత్సవం, ఉగాదిని పురస్కరించుకుని తెలుగు భాష కోసం కృషి చేసిన మహనీయులకు పురస్కారాలు అందిస్తామని, సంస్కృత అకాడమీ ద్వారా ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి ఒక సంస్కృత కవికి సంబంధించిన జన్మదినం, రచనలకు సంబంధించిన విషయాలపై ఒక కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. కొంతమంది సైబర్ నేరస్తులు తెలుగు, సాంస్కృతిక అకాడమీ పేరు మీద నకిలీ వెబ్‌సైట్‌ను తయారు చేసి నిరుద్యోగులకు అవకాశాలు, అకాడమీ పోస్టులు పడుతున్నాయని దరఖాస్తు చేసుకోవాలని వస్తున్న వార్తలు అవాస్తవమని తెలిపారు. ఆ వార్తలపై విజయవాడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని అన్నారు. తెలుగు భాషను ప్రతి ఒకరికి చేరువ చేయాలనే ఉద్దేశంతో తెలుగు మాండలికం పుస్తకాన్ని ప్రతి జిల్లాలో ముద్రించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు, సంస్కృత అకాడమీ రీసెర్చ్ అసిస్టెంట్ ఎస్.టి.ఎ.రాజ్యలక్ష్మి, రవిప్రసాద్, అకాడమీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూలేకు సీఎం నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమం, ఐఅండ్‌పీఆర్ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజని, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పాల్గొన్నారు. అణగారిన వర్గాల కోసం జీవితాన్ని ధారబోసిన మహనీయుడు పూలే అని సీఎం కొనియాడారు. దేశంలో సామాజిక న్యాయం, మహిళా సాధికారత ఉద్యమాలకు పూలే ఆద్యులని సీఎం ట్వీట్ చేశారు.

నేడు ప్రకాశం జిల్లాకు సీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ప్రకాశం జిల్లాలో పర్యటించనున్నారు. వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేయనున్నారు. ఉదయం 9 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి ఆయన బయలుదేరి 9.55 గంటలకు మార్కాపురానికి చేరుకుంటారు. ఉదయం 10.15 నుంచి 12.05 గంటల వరకు ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాల గ్రౌండ్ బహిరంగ సభా వేదిక వద్ద వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేసి, అనంతరం జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఈబీసీ నేస్తం లబ్ధిదారులకు నగదు జమ చేస్తారు. 12.40 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 1.35 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే వారు ఎవరైనా వారిని ఆదుకోవాలనే లక్ష్యంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాపులతో పాటు అగ్రవర్ణాల్లోని పేదలకు అండగా ఉండేందుకు ఈబీసీ నేస్తం పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

మోదీ, జగన్ తోడుదొంగలు

ఓబులేసు విమర్శ

విశాలాంధ్ర-నంద్యాల(జిల్లా): నరేంద్రమోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నిరంతర పోరు కొనసాగుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు స్పష్టంచేశారు. కార్మిక హక్కులు కాలరాయడంలో బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలు తోడుదొంగలుగా మారాయని, వచ్చే ఎన్నికల్లో ఆ ప్రభుత్వాల భరతం పడతామని హెచ్చరించారు. కార్మిక హక్కుల పరిరక్షణకు దేశవ్యాప్త పోరుకు సిద్ధం కావాలని, కార్మికగర్జనగా 138వ మే డేను వాడవాడలా నిర్వహించాలని ఓబులేసు పిలుపునిచ్చారు. స్థానిక రామకృష్ణ డిగ్రీ ఆడిటోరియంలో ఏఐటీయూసీ జిల్లా సర్వసభ్య సమావేశం రఘురామమూర్తి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఓబులేసు మాట్లాడుతూ కార్మిక సమస్యలు పరిష్కరించడంలో, కనీస వేతనాలు అమలు చేయడంలో, పని భద్రత, ఉద్యోగ భద్రత కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాల పేరుతో మభ్యపెడుతూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని, దాని వెనుక గల కార్మికుల శ్రమను గుర్తించడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం పనిచేస్తున్న ఆశ, అంగన్వాడి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల కడుపు కొడుతున్నారన్నారు. ఆప్కాస్ పేరుతో లక్షల మంది ఔట్ సోర్సింగ్ కార్మికులను తమ గుప్పెట్లో పెట్టుకున్న ప్రభుత్వం...వారి వేతనాలు మాత్రం పెంచడం లేదని నిందించారు. స్కీమ్ కార్మికుల వేతనాలను 26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. మోదీ చెప్పిందే...జగన్ చేస్తున్నారని ఆరోపించారు. విశాఖ ఉక్కుతో పాటు ప్రభుత్వ రంగసంస్థలన్నింటినీ అదానీకి కట్టబెడుతున్నారని, కార్మికుల శ్రమశక్తితో నడుస్తున్న సంస్థలను ప్రైవేటీకరించే హక్కు మోదీకి లేదని ఓబులేసు అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ కార్మిక ఉద్యమాలకు అండగా ఉంటామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఏప్రిల్ 14 నుండి జరిగే పాదయాత్రలను జయప్రదం చేయాలని కార్మికులను కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు మునెప్ప, లలితమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, రమేశ్‌బాబు, లక్ష్మి నారాయణ, సుగుణమ్మ, అబ్బాస్, శ్రీనివాసులు, భాస్కర్, విజయలక్ష్మి, ప్రసాద్, సుజాత, శ్రీనివాసులు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, నాయకులు సుబ్బరాయుడు, శ్రీనివాసులు, సోమన్న, నాగరాముడు, ధనుంజయ, ప్రజాసంఘాల జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

బీజేపీ దుష్టపాలనపై పోరు

ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపు

విశాలాంధ్ర-వినుకొండ: బీజేపీ దుర్మార్గ పాలనపై అలుపెరగని పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఉద్ఘాటించారు. సీపీఐ కార్యాలయం శివయ్య భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముప్పాళ్ల మాట్లాడారు. అధికారంలో ఎవరున్నా అంబానీ, అదానీ వంటి బడాబాబులకు ఊడిగం చేయడమే పనిగా పెట్టుకున్నారని ముప్పాళ్ల విమర్శించారు. మోదీ నియంతృత్వ విధానాలపై ఏప్రిల్ 14 నుంచి మే 15వ తేదీ వరకు సీపీఐ, సీపీఎం ప్రచారభేరీ మోగిస్తున్నాయని చెప్పారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా 14 నుంచి నెలాఖరు వరకు రెండు పార్టీలు కలిసి పాదయాత్ర చేస్తాయని, మే 1 నుండి 15వ తేదీ వరకు సీపీఐ దానిని కొనసాగిస్తుందని ముప్పాళ్ల వివరించారు. ప్రధాన మోదీ ఉద్యోగ కల్పనపై దృష్టి పెట్టకుండా నిరుద్యోగులను నిలువునా మోసగించారని మండిపడ్డారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని ప్రగల్భాలు పలికిన మోదీ...చివరికి రైతులు ఉద్యమబాట పట్టేలా చేశారని చెప్పారు. క్రైస్తవ మందిరాలపై దాడులు మరింత పెరిగాయన్నారు. మోదీ అధికారం చేపట్టిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, పెట్రో ధరలకు రెక్కలొచ్చాయని, కొత్తగా ఒక్క ప్రభుత్వ రంగ సంస్థను స్థాపించకపోగా లాభదాయక సంస్థలను ప్రైవేట్‌కు కట్టబెడుతున్నారని విమర్శల వర్షం కురిపించారు. సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు బతికే పరిస్థితి కనిపించడం లేదని, అందుకే దేశాన్ని పాలించే హక్కును బీజేపీ కోల్పోయిందన్నారు. వామపక్షాలు చేపట్టే పాదయాత్రలో మహిళలు, ప్రజలు పెద్దఎత్తున భాగస్వా ములు కావాలని కోరారు. హోదా కోసం కేంద్రం మెడలు వంచుతానన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి... చివరికి బీజేపీ పెద్దల వద్ద మోకరిల్లుతున్నారని ఆరోపిం చారు. కేసులు మాఫీ కోసం జగన్ ఢిల్లీ చుట్టూ తిరుగుతు న్నారన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బ తీస్తున్నారన్నారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్, ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము, నాయకులు వందనం, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పూలేకు ఘన నివాళి

కులవ్యవస్థ, వెట్టిచాకిరీ, సాంఘిక దురాచారాలపై మహోద్యమం నడిపిన వ్యక్తి జ్యోతిరావు పూలే అని ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. జ్యోతిరావు పూలే 196వ జయంతి వేడుకల్లో పాల్గొన్న ముప్పాళ్ల...పూలె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పూలేతోపాటు ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే సమాజాన్ని చైతన్య పరిచేందుకు పాఠశాలలు ఏర్పాటు చేసి తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా నిలిచారని ముప్పాళ్ల పేర్కొన్నారు. మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ మూఢవిశ్వాసాలపై పూలే అలుపెరగని పోరాటం చేశారన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే

జేవీ సత్యనారాయణమూర్తి నివాళి

విశాలాంధ్ర-విశాఖ: అణగారిన వర్గాల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. పూలే జయంతి సందర్భంగా మంగళవారం గ్రీన్‌పార్క్ సమీపంలోని పూలే విగ్రహానికి సీపీఐ అధ్వర్యంలో పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆధునిక భారతదేశంలో సామాజిక న్యాయం, మహిళా సాధికారత ఉద్యమాలకు పూలే ఆద్యుడని, చదువులతోనే సమన్యాయం, అభివృద్ధి సాధ్యమని నమ్మిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. విద్య ద్వారానే దోపిడీకి గురైన కులాలు, మహిళలకు విముక్తి కలుగుతుందని ఆయన భావించారన్నారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి మహిళల విద్యాభివృద్ధికి కృషి చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, పి.చంద్రశేఖర్, సీఎన్ క్షేత్రపాల్, ఎం.మన్మథరావు, జి.కాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నేత బోసుబాబుకు డాక్టరేట్

విశాలాంధ్ర-గాజువాక: వినియోగ దారుల హక్కుల పరిరక్షణ కమిషన్ జాతీయ ఉపాధ్యక్షుడు, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు జి.బోసుబాబుకు గౌరవ డాక్టరేట్ లభించింది. ముంబై సెంట్రల్ క్రిస్టియన్ యూనివర్సిటీ ఆయన చేసిన సామాజిక సేవలను గుర్తించి ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఇటీవలే ముంబైలో జరిగిన డాక్టరేట్ ప్రదానోత్సవ సభలో బోసుబాబును సత్కరించి మెడల్ సహా అవార్డు ధ్రువపత్రాన్ని అతిథుల సమక్షంలో అందజేశారు. అవార్డు గ్రహీత బోసుబాబు గత కొన్నేళ్లుగా సామాజిక వికాసానికి దోహదం చేసే అనేక కార్యక్రమాలు చేపట్టారు. బోసుబాబుకు ఈ అవార్డు లభించడం పట్ల ఉక్కు ఉద్యోగులు అనేక మంది వేర్వేరు ప్రకటనల్లో తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. తన సేవలను గుర్తించి డాక్టరేట్ పురస్కారానికి ఎంపిక చేసిన సెంట్రల్ క్రిస్టియన్ యూనివర్సిటీ యాజమాన్యానికి ఆయన మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. బోసుబాబుకు డాక్టరేట్ ప్రదానం చేయడంపై సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, సీపీఐ గాజువాక నియోజక వర్గ నాయకులు ఎల్లేటి శ్రీనివాసరావు, జి.ఆనంద్, టి.కనకరాజు, అప్పారి విష్ణుమూర్తి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఒప్పంద లెక్చరర్ల క్రమబద్ధీకరణకు కృషి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణకు కృషి చేస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి హామీ ఇచ్చారు. విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల ఆవరణంలో మంగళవారం కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ సమావేశం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి.మోజెస్ దయాకర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కల్పలతారెడ్డి మాట్లాడుతూ... ఇరవై ఏళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 3618 మంది కాంట్రాక్టు ఉద్యోగులందర్నీ క్రమబద్ధీకరించే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికిగాను 12నెలల వేతనాన్ని (ఒక రోజు బ్రేక్‌తో) అమలు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాంధీ మాట్లాడుతూ... తమ డిమాండ్లన్నీ న్యాయమైనవని, ప్రభుత్వం స్పందించి వెంటనే పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కే భాగ్యలక్ష్మి, జిల్లా నాయకులు సురేష్, కృష్ణంరాజు, మూర్తి, మోహన్ పాల్గొన్నారు.

మహిళల రక్షణకు కొత్త చట్టాలు

దుర్గాభవాని డిమాండ్

విశాలాంధ్ర-నంద్యాల(జిల్లా): మహిళలపై దాడులు, అత్యాచారాల నిరోధానికి కఠినచట్టాలు తీసుకురావాలని, మహిళలకు భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నంద్యాల జిల్లా విస్తృతస్థాయి సమావేశం నంద్యాల ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఉన్న నిశాంత్ భవన్‌లో సుగుణమ్మ అధ్యక్షతన మంగళవారం జరిగింది. దుర్గాభవాని, ఆంధ్రప్రదేశ్ చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫకృద్దీన్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి జి.సోమన్న, ఆళ్లగడ్డ కార్యదర్శి భాస్కర్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు పాల్గొన్నారు. దుర్గాభవాని మాట్లాడుతూ మహిళా హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామని చెప్పారు. సమాన పనికి సమాన వేతనం, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, మహిళలకు 50శాతం రిజర్వేషన్ వంటి అనేక కీలక అంశాలపై ఉద్యమాలు చేసిన ఘనత మహిళా సమాఖ్యకు ఉందన్నారు. తాను అధికారంలోకి వస్తే మహిళల భద్రతకు కొత్త చట్టాలు తెస్తానని, మద్యపానంపై నిషేధం విధిస్తానని హామీ ఇచ్చిన సీఎం జగన్...ఇప్పుడు వాటిని పట్టించుకోవడం లేదని దుర్గాభవాని విమర్శించారు. నవరత్నాల పేరుతో కోరంత ఇచ్చి...కొండంత దోచుకుంటున్నారని మండిపడ్డారు. మహిళల భద్రత కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేకపోతే మహిళా సమాఖ్య అధ్వర్యంలో పోరాటాలు నిర్మిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి డోన్. నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, మహానంది, గోస్పాడు నుండి మహిళలు తరలివచ్చారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నంద్యాల జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా నారాయణమ్మ, ఉపాధ్యక్షురాలిగా లక్ష్మీదేవమ్మ, స్వాతి, లక్ష్మీదేవి, ప్రధాన కార్యదర్శిగా సుగుణమ్మ, సహాయ కార్యదర్శులుగా హసీనా, అరుణ, దేవమణి, కోశాధికారిగా సుశీలమ్మతో పాటు 13 మంది నూతన కార్యవర్గాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకున్నది.

విద్య, వైద్యం అత్యంత కీలకం

టీటీడీ ఆసుపత్రుల సేవలు అభినందనీయం

కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పురి

విశాలాంధ్ర- తిరుపతి: దేశాభివృద్ధికి ఆరోగ్యం, విద్య కీలకమని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురి అన్నారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానంతరం కేంద్రమంత్రి కుటుంబ సభ్యులతో కలిసి టీటీడీ అధ్వర్యంలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం, బర్డ్ ఆసుపత్రులను మంగళవారం సందర్శించారు. శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆసుపత్రి దేశానికే ఆదర్శమని ఆయన కొనియాడారు. ఆసుపత్రి వార్డుల్లో గుండె జబ్బులతో చికిత్స పొందుతున్న చిన్నారులను, క్యాథ్‌ల్యాబ్, ఐసీయూ తదితర వార్డులను మంత్రి సందర్శించి, రోగుల తల్లిదండ్రులతో మాట్లాడారు. నిరుపేదలకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు చేసి బాలింతలకు, చిన్నారులకు టీటీడీ అందిస్తున్న సేవలపై మంత్రి హర్షం వ్యక్తంచేశారు. అనంతరం బర్డ్ ఆసుపత్రిని సందర్శించి నిరుపేదలకు ఉచితంగా మోకాలి కీళ్ల మార్పిడి, ఇతర ఎముకల సంబంధిత వ్యాధులకు అందుతున్న చికిత్సలను పరిశీలించారు. అనంతరం మంత్రి పురి మీడియాతో మాట్లాడుతూ రెండు ప్రతిష్ఠాత్మక ఆసుపత్రులకు టీటీడీ అందిస్తున్న సేవలు అద్భుతమని, ముఖ్యంగా చిన్న పిల్లల గుండెజబ్బు ఆసుపత్రిలో అంకితభావంతో సేవలు అందిస్తున్న వైద్యులు, పారా మెడికల్ సిబ్బందిని అభినందించారు. ఆస్పత్రి ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వ చొరవను మంత్రి ప్రశంసించారు. కరోనా కష్టకాలంలోనూ బర్డ్ ఆసుపత్రి కోవిడ్ కేర్ సెంటర్‌గా పనిచేసినట్లు తెలిసిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమర్థ నాయకత్వంలో భారతదేశం కోవిడ్ క్లిష్ట పరిస్థితులను అధిగమించి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, జేఈవో సదా భార్గవి, చిన్నపిల్లల ఆసుపత్రి డైరెక్టర్ డా.శ్రీనాథ్ రెడ్డి, డాక్టర్ గణపతి, బర్డ్ వైద్యులు డాక్టర్ రామ్మూర్తి, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ వేణుగోపాల్, ఈఈ శ్రీకృష్ణారెడ్డి తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

డీఎస్సీ-98 నియామకాల్లో కోటా అమలుకు ఎస్టీయూ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: డీఎస్సీ-1998 నియామకాల్లో రాజ్యాంగ పరంగా అమలు చేయాల్సిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగ రిజర్వేషన్లను అమలు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న విజ్ఞప్తి చేశారు.మంగళవారం పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేష్‌కుమార్‌ను ఎస్టీయూ నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. 4072 పోస్టులలో ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీలకు 27 శాతం, వికలాంగులు 4 శాతం చొప్పున రిజర్వేషన్లు అమలు చేశాకే డీఎస్సీ-1998 నియామకాలు చేపట్టాలని కోరారు. రాజ్యాంగ స్ఫూర్తిని అమలు చేయాలన్నారు. నెల్లూరు జిల్లాలో ఇవ్వనున్న 239 మంది అభ్యర్థుల్లో ఒక్కరూ ఎస్సీ, ఎస్టీ కులాల నుంచి ఎంపికవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మిగిలిన జిల్లాల్లోనూ రిజర్వేషన్లు అమలు చేసి దాదాపు 2100 పోస్టులు ఆయా ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగ వర్గానికి కేటాయించినప్పుడే న్యాయం జరుగుతుందన్నారు. మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు ఇస్తే వెనుకబడిన సామాజిక వర్గాలకు సామాజిక న్యాయమెలా జరుగుతుందని ప్రశ్నించారు.

అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సుతో

పర్యాటక రంగానికి నూతనోత్సాహం

రూ.21,941 కోట్లతో 123 ఎంఓయూలు : మంత్రి రోజా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సు (జీఐఎస్)తో పర్యాటక రంగానికి నూతనోత్సాహం వచ్చిందని రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా అన్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడలు, యువజనాభివృద్ధి శాఖలపై విజయవాడ బెర్మ్‌పార్క్‌లో మంగళవారం అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. రోజా మాట్లాడుతూ జీఐఎస్ ద్వారా పర్యాటకం, హాస్పటాలిటీ రంగాల్లో రూ.21,941 కోట్లతో 123 అవగాహన ఒప్పందాలు కుదిరాయని, తద్వార 41,412 మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయన్నారు. కుదిరిన ఒప్పందాల్లో 40 డీపీఆర్‌లు ఇప్పటికే సమర్పించినట్లు చెప్పారు. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చినవారికి అన్ని విధాలుగా సహకరించేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నడూ లేనివిధంగా పర్యాటక, సాంస్కృతిక, క్రీడా రంగాల్లో అనేక కార్యక్రమాల్ని చేపట్టామన్నారు. ఈ ఏడాది ఏపీటీడీసీ రికార్డు స్థాయిలో రూ.163.25 కోట్ల టర్నోవర్ సాధించిందని చెప్పారు. ఓబెరాయ్ గ్రూప్ ద్వారా పీపీపీ విధానంలో విశాఖపట్నం, రాజమహేంద్రవరం, తిరుపతి, హార్సిలీ హిల్స్, గండికోటలో రూ.1350కోట్ల అంచనా వ్యయంతో ఏడు స్టార్‌హోటళ్ల నిర్మాణం చేపడుతున్నామని, తద్వార 10,900 మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. విశాఖపట్నం, తిరుపతికి సంబంధించి ఇప్పటికే ఒప్పందాలు జరిగాయని, మిగితావీ త్వరలోనే జరుగుతాయని రోజా చెప్పారు. జల, సాహస క్రీడలను రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 21 ప్రాంతాల్లో తొలి దశలో అందుబాటులోకి తెస్తామన్నారు. టెంపుల్ టూరిజంలో దేశంలోనే మూడవ స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉందని, ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనల్లో కేంద్ర ప్రసాద్ పథకం కింద సింహాచలం ఆలయాభివృద్ధికి రూ.54.04కోట్లు, అన్నవరం దేవాలయాభివృద్ధికి రూ.54.17 కోట్లు కేంద్రం మంజూరు చేసిందని రోజా తెలిపారు.

విశాఖ ఉక్కుపై తెలంగాణ సీఎం నిర్ణయం హర్షణీయం

విశాలాంధ్ర-కూర్మన్న పాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయం హర్షణీయమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నడిపేందుకు ముడి సరుకు, మూల ధనం కోసం తెలంగాణ సీఎం కేసీఆర్ ఆదేశం మేరకు సింగరేణి బొగ్గు గనుల అధికార ప్రతినిధులు ఉక్కు కర్మాగారాన్ని సందర్శించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మంగళవారం ఆ ప్రతినిధుల బృందాన్ని విశాఖ పరిపాలన భవనంలో సీఎండీ సమావేశ మందిరంలో కలసి ప్రజల సంపద ప్రజలకే చెందే విధంగా తెలంగాణ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని అన్నారు. ఈ విషయంలో యాజమాన్యం నుంచిగానీ, యూనియన్ ప్రతినిధుల నుంచిగానీ ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. దానికి అనుగుణంగా ఉక్కు కర్మాగారాన్ని దక్కించుకోవడం కోసం చేసే ప్రయత్నాలు సఫలీకృతం కావాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. సింగరేణి కాలరీస్ నుంచి డైరెక్టర్ సత్యనారాయణ రావు, సుబ్బారావు, బలరామ్, మరో ఇద్దరు జనరల్ మేనేజర్‌లు మంగళవారం విశాఖ ఉక్కు పరిపాలన భవనంలో మార్కెటింగ్ అధికారులతో చర్చించారు. అనంతరం సీఎండీ సమావేశ మందిరంలో విశాఖ ఉక్కు కర్మాగారం డైరెక్టర్లు వేణుగోపాలరావు, భగీచి, మహంతితో చర్చించారు. ప్రధానంగా విశాఖ ఉక్కు కర్మాగారం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం గురించి ఈ చర్చ జరిగింది. ఈ ప్రతినిధి బృందాన్ని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, వై మస్తానప్ప, సిహెచ్ సన్యాసిరావు, వరసాల శ్రీనివాస్, పోరాట కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంపాదకీయం

గవర్నర్ల పాత్ర వివాదాస్పదం

చాలా కాలంగా అనేక రాష్ట్రాలలో గవర్నర్ల పాత్ర వివాదాస్పదమవుతోంది. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ ఒకే పార్టీ ప్రభుత్వాలు ఉన్నంత కాలం గవర్నర్ల విధి నిర్వహణ సజావుగానే సాగింది. కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు గవర్నర్లు నడుచుకోవడం, తమకు అనుకూలమైన వారిని గవర్నర్లుగా నియమించడంతో వివాదాలు ఉండేవి కాదు. 2014లో బీజేపీ నాయకత్వంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుండి దేశంలో ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో గవర్నర్ల పాత్ర సంప్రదాయాలకు, నియమ నిబంధనలకు అనుగుణంగా లేక తీవ్ర విమర్శలకు లోనవుతోంది. ముఖ్యంగా కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల గవర్నర్లు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను వేధింపులకు గురిచేసేందుకే ప్రయత్నిస్తున్నారని విమర్శలు ఎక్కువగా వచ్చాయి. కారణం... రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం అసెంబ్లీలలో తీర్మానించిన బిల్లులకు సకాలంలో తమ ఆమోదం తెలియజేయకుండా తొక్కి పెడుతున్నారు. తాజాగా తమిళనాడు గవర్నరు వ్యవహారసరళి తరచుగా రాష్ట్రంలోని డిఎంకె ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతోంది. గవర్నరు కలిగిస్తున్న ఆటంకాలను మోదీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతున్నప్పటికీ ప్రయోజనం కలగడం లేదు. అసెంబ్లీ తీర్మానించి పంపిన బిల్లులను గవర్నరు పరిశీలించి ఆమోదించడం లేదా తిరస్కరించడం చేయవచ్చు. ప్రభుత్వం ఒకవేళ అదే బిల్లును మళ్లీ గవర్నరుకు పంపినట్లయితే తప్పనిసరిగా ఆమోదించవలసి ఉంటుంది. ఏ విషయం తేల్చకుండా నెలల కాలం గవర్నరు తొక్కిపెట్టి ఉంచినప్పుడే సమస్య ఏర్పడుతుంది. అప్పుడే గవర్నరుకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య ఘర్షణ ఏర్పడుతుంది. మోదీ ప్రభుత్వ కనుసన్నల్లో నడుచుకోవడం వల్లనే గవర్నర్లు విమర్శలకు గురవుతున్నారు. తమిళనాడు గవర్నరు రవి ఈ విషయంలో అనేకసార్లు వివాదాస్పదంగా వ్యవహరించారు. తాజాగా ఆన్‌లైన్ జూదాలను నిషేధించడానికి సంబంధించిన బిల్లును గవర్నరుకు పంపినప్పటికీ ఆయన తన వద్దనే ఉంచుకొని ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని ముఖ్యమంత్రి స్టాలిన్ విమర్శించారు. బిల్లులను ఆమోదించి తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి పంపడానికి గడువు విధించాలని రాష్ట్రపతికి, కేంద్ర ప్రభుత్వానికి విన్నవిస్తూ తమిళనాడు అసెంబ్లీ సోమవారం తీర్మానించింది. ఈ విషయంలో రాష్ట్రపతి, కేంద్రం సముచిత నిర్ణయం తీసుకున్నట్లయితే చాలావరకు వివాదాలు తరచుగా జరగకుండా నివారించే అవకాశం ఉంటుంది. గవర్నరు చర్యను వ్యతిరేకిస్తూ తమిళనాడు ప్రభుత్వం గతంలో ఒక తీర్మానం ఆమోదించి పంపింది. అయినప్పటికీ కేంద్రం నుండి ఎలాంటి స్పందన లేదు. మోదీకి బీజేపీయేతర ప్రభుత్వాలను ఇబ్బందుల పాలు చేయడం, వీలయితే ఆ ప్రభుత్వాలను పడగొట్టి బీజేపీ ప్రభుత్వాలను నెలకొల్పడం అలవాటుగా మారిందని చాలా రాష్ట్రాల్లో జరిగిన ఇలాంటి సంఘటనలు తార్కాణంగా నిలుస్తాయి.

1967లో ఎన్నికల తర్వాత పరిస్థితిలో గణనీయమైన మార్పు వచ్చింది. కేంద్రంలో, రాష్ట్రాలలో ఒకే పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పరిస్థితి సజావుగా సాగింది. 1967 ఎన్నికల తర్వాత ఎనిమిది రాష్ట్రాలలో కాంగ్రెస్ ఓడిపోయి ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఆనాటి నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ దశలో కోర్టు జోక్యం చేసుకొని గవర్నర్ల అధికారాలపై ఆంక్షలు విధించింది. అంతవరకు స్వతంత్రంగా పనిచేసిన గవర్నర్లు తమ పని విధానాన్ని మార్చుకోవలసి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ మంత్రివర్గ సూచనల మేరకు గవర్నర్లు పని చేయవలసి వచ్చింది. ఒకవేళ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని గవర్నరు సిఫారసు చేస్తే దానిని కోర్టులు పరిశీలించి నిర్ణయాలు తెలిపే వీలు కలిగింది. అయితే రాజకీయ వాతావరణం తీవ్ర మార్పునకు గురైంది. బీజేపీయేతర రాష్ట్రాలలో అసెంబ్లీ తీర్మానించి పంపిన బిల్లుల విషయంలో, అలాగే విశ్వవిద్యాలయాల పాలన వ్యవహారాలలో దీర్ఘకాలం అనుసరిస్తూ వస్తున్న సంప్రదాయాలను గవర్నర్లు ఉల్లంఘిస్తున్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం మంచి సలహాలు ఇవ్వవలసిన గవర్నరు ప్రభుత్వ వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం పెరిగింది. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి తగినన్ని ఆధారాలు లేకపోయినప్పటికీ గవర్నరు ఆమోదించడాన్ని సుప్రీంకోర్టు ఇటీవల తప్పుపట్టిన విషయం తెలిసిందే. అయినప్పటికీ గవర్నర్లు తమ వ్యవహార సరళిని మార్చుకోకపోవడం శోచనీయం.

గవర్నరును తొలగించడానికి మార్గం లేనప్పుడు, వివాదం మరింత ముదిరినప్పుడు ప్రజలు నిరసనలు, ఆందోళనలు చేస్తారు. గవర్నరు చర్యలను ఖండించడానికి సభలు, సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. గవర్నరు రాజ్యాంగ నియమ నిబంధనలు పాటించనప్పుడు, రాజ్యాంగాన్ని ప్రశ్నించినప్పుడు కోర్టు జోక్యంతో గవర్నరును తొలగించవచ్చు లేదా తగిన చర్య తీసుకోవలసిందిగా కేంద్రాన్ని ఆదేశించే అవకాశం ఉంటుందని న్యాయనిపుణులు విశ్లేషించారు. ఆర్టికల్ 361 కింద గవర్నర్లు కోర్టులకు జవాబుదారీగా ఉండవలసిన అవసరం లేదన్న అంశం ఉన్నప్పటికీ...గవర్నరు రాజ్యాంగంపై విశ్వాసం లేదని చెప్పినప్పుడు ఆయనకు ఉన్న 361 ఆర్టికల్ కల్పించిన రక్షణ ఉండదని కూడా న్యాయ నిపుణులు వివరిస్తున్నారు. అయితే నేటి పరిస్థితి వేరుగా ఉంది. మోదీ ప్రభుత్వం ఢిల్లీ ఆప్ ప్రభుత్వాన్ని ఎన్ని రకాలుగా ఇబ్బందిపాలు చేస్తున్నదీ నిత్యం తెలుస్తూనే ఉన్నది. ఇప్పుడు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం అనుభవిస్తున్న అధికారాలను లెఫ్టినెంట్ గవర్నరుకు కట్టబెట్టింది. ఆప్ ప్రభుత్వ కార్యకలాపాలన్నింటికీ లెఫ్టినెంట్ గవర్నరు అడ్డుపడుతూ ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నారు. ఈ వివాదాలకు మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కారణం కాదా!

తగ్గిన ప్రైవేటు పెట్టుబడులు

అంతర్జాతీయంగా పెచ్చురిల్లిన ద్రవ్యోల్బణం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, రూపాయి పతనం వంటి పరిణామాలు 2021 ఏడాది చివరి త్రైమాసికం నుంచి భారత్ బాహ్యరంగాన్ని తీవ్ర ఒత్తిళ్ళకు గురిచేస్తూ వస్తోంది. సన్నగిల్లిన ప్రైవేట్ పెట్టుబడులు, కలవరపెడుతున్న ద్రవ్యోల్బణం, ఆందోళన రేకెత్తిస్తున్న నిరుద్యోగిత, పెరుగుతున్న వాణిజ్యలోటు, కరెంటు ఖాతాలోటు, రూపాయి పతనం వంటి ఆర్థిక ప్రతికూలతల మధ్య కేంద్ర ఆర్థికమంత్రి ఫిబ్రవరి 1 న బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, రూపాయి పతనాన్ని అరికట్టడానికి ఆర్‌బీఐ మానిటరీపాలసీ కమిటీ రంగప్రవేశం చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. 2022లో ప్రారంభమైన రష్యా- ఉక్రెయిన్ యుద్ధంతో కరెంట్ ఖాతాలోటు 2022 జూన్ త్రైమాసికానికి 2.8 శాతానికి ఎగబాకింది. 2013 తర్వాత ఇదే అత్యంత అధికలోటు. 2022 రెండో త్రైమాసికంలో కూడా దిగుమతులు 25 శాతం పెరుగుదలతో రు.12.16 లక్షల కోట్లు నమోదుకావడం, ఎగుమతులు ఆ స్థాయిలో పెరగకపోవడంతో సీఏడీ ఎక్కువైంది. యుఎస్ ఫెడ్ రిజర్వు భారీస్థాయిలో వడ్డీరేట్లను పెంచడంతో సెప్టెంబరు 2022 వరకు డాలరు బలపడింది. ఆ తర్వాత వడ్డీరేట్లను సడలించడంతో సెప్టెంబరులో డాలరు ఆరు శాతానికి దిగజారింది. ఈ పరిణామం రూపాయిపై ఒత్తిడి తగ్గడమే కాకుండా, డాలరు ఆధారిత దిగుమతుల విలువ తగ్గడానికి ఉపకరించింది 2022 జూన్‌లో పతాకస్థాయికి వస్తువుల ధరలు చేరిన తర్వాత తగ్గడం ప్రారంభం దీనికి తోడైయింది. ముఖ్యంగా భారత్ అత్యధికంగా దిగుమతి చేసుకొంటున్న ముడి చమురు ధరలు 66శాతం తగ్గడం, రష్యా 40శాతం రాయితీతో చమురు సరఫరాతో కొంత ఉపశమనం కలిగించాయి. జి-7 దేశాలు భారత్‌కు రష్యన్ చమురు సరఫరాధరపై విధించిన పరిమితి గత డిశెంబరు నుంచి అమలు చేయవలసి ఉన్నప్పటికీ, భారత్ రష్యా నుంచి అదే రేటుకు నేటికీ కొనసాగిస్తుండడం గమనార్హం. ఫలితంగా సగటున రోజున 1.4 మిలియను బేరళ్ళు 2022 డిశెంబరులోనూ, 1.2 మిలియను బేరళ్ళు జనవరి 2023 లోనూ దిగుమతి చేసుకోవడంతో రష్యా భారత్‌కు ముడిచమురు విషయంలో ప్రథమ సరఫరాదారుగా నిలిచింది. అంతేగాక గత జనవరి-అక్టోబరు మధ్యకాలంలో రు.1,70,000 కోట్లు విదేశీ పెట్టుబడులు వెనక్కి మరలినా, నవంబరు నుంచి ఈక్విటీ, రుణాల రూపంలో రు.40,000 కోట్లు తిరిగి దేశ ఆర్థికవ్యవస్థలోకి ప్రవహించాయి. వాణిజ్యలోటును తగ్గించడంలో ఇవన్నీ బాగా ఉపయోగపడ్డాయి.

భారత దిగుమతుల్లో ముడిచమురు, బొగ్గు, మెషినరీ, వాటి పరికరాలు వంటివి ముఖ్యమైనవి. వీటి దిగుమతులు, వినియోగం పెరిగితే, దీర్ఘకాలంలో దేశాభివృద్ధి భారీ స్థాయిలో పెరిగే అవకాశం ఉంది. బంగారం దిగుమతుల విషయంలో ప్రభుత్వం అధిక దిగుమతి పన్నులు విధిస్తున్నప్పటికీ, వాటి ప్రభావం దిగుమతులను కట్టడి చేయండంలో ప్రభావం చూపలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో వాణిజ్యలోటును నియంత్రించాలంటే ఎగుమతులను పెంచడమే కాకుండా దిగుమతులను కట్టడిచేసే ప్రయత్నాలు చేపట్టాలి. చైనా ఉత్పత్తి కోవిడ్ నిబంధనల కారణంగా స్తంభించడంతో ఉత్పత్తి, ఎగుమతులు చేసే పరిస్థితి కోల్పోయింది. దీనితో దేశీయ కంపెనీలకు వివిధ ప్రోత్సాహకాలు కల్పించడం ద్వారా ఉత్పత్తులపెంపు, ఎగుమతులుచేసే అవకాశాలు ప్రభుత్వం కల్పించ వలసిఉంది. పియల్‌ఐ పథకాన్ని మరింత విస్తరింపజేయాలి. అలాగే మేక్‌ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, చైనా ప్లస్ ఒన్ వ్యూహం వంటి నినాదాలను మరింత పబ్లిసిటీతో పారిశ్రామికవర్గాలకు చేర్చాలి. జూలైలో ఆర్.బి.ఐ ప్రవేశపెట్టిన రూపాయల్లో విదేశీ వాణిజ్య విధానంతో భారత్ విదేశీమారక నిల్వలను ఆదాచేయడంలో ప్రముఖపాత్ర పోషిస్తోంది. ఇప్పటికే ఈ ప్రయోగం, రష్యాలో విజయవంతంగా అమలవుతోంది. దీనివల్ల భారత్‌కు రెండు లాభాలు 1) రష్యా తక్కువ ధరకు సరఫరా చేస్తున్నందున దేశీయ ముడిచమురు దిగుమతుల బిల్లు తగ్గడం 2) రష్యా విదేశీ వాణిజ్యంతో భారత్ వాణిజ్యలోటుతో రష్యాకు మన సరకుల ఎగుమతులను పెంచే అవకాశం ఏర్పడింది. భారత్, శ్రీలంక, మాల్దీవులు, మారిషస్ దేశాలతో రూపాయితో వ్యాపారానికై సంప్రదింపులు ప్రారంభించింది. యుఏఈ, ఆస్ట్రేలియా, "ఫ్రీ ట్రేడ్" ఒప్పందాలు విజయవంతమయ్యాయి. ఈయు, కెనడా, యుకే దేశాలతో ఈ కొత్త ఏడాదిలో జరగబోయే సంప్రదింపులు సఫలమవుతాయని ప్రభుత్వ వర్గాలు అంచనావేస్తున్నాయి.

డా.యస్.వై.విష్ణు, సెల్: 9963217252

బెంబేలెత్తిస్తున్న ఆన్‌లైన్ మోసాలు

జీ. ఈశ్వరయ్య

సైబర్ నేరాలు నానాటికీ విపరీతంగా పెరుగుతున్నాయి. అంతర్జాలాన్ని ఊతంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు కొత్త పంథాల్లో అమాయకుల నుంచి డబ్బులు దోచుకుంటున్నారు. రోజురోజుకూ బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. సుదూర రాష్ట్రాల నుంచి నేరాలకు పాల్పడుతుండటంతో నిందితులను పట్టుకుని సొమ్ము రికవరీ చేయడం పోలీసులకు సవాలుగా మారింది. అమాయకత్వం, అత్యాశతో ప్రజలు నేరగాళ్లకు చిక్కి మోసపోతున్నారు. ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక కొందరు కుమిలిపోతున్నారు. మరికొందరు బయటకు చెప్పుకుంటే పరువు పోతుందని భయపడుతున్నారు. ఇంకొందరు ఏకంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇటీవల కర్నూలులో ఓ యువకుడు విదేశీ ఉద్యోగం నెపంతో ఏకంగా రూ.20 లక్షలు మోసపోయాడు. కొందరు ప్రముఖ సంస్థల వస్తువులను వార్షికోత్సవం సందర్భంగా తక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు రాయితీల పేరుతో, సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలిచ్చి మోసగిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం జిల్లాలోని పోలీసు అధికారుల పేరుతో ఫేక్ ఖాతాలు తెరిచి వారి సన్నిహితులను డబ్బులు అడిగి ఖాతాలో వేయించుకునే యత్నం చేశారు. కరోనా సమయంలో బీమా సొమ్ము పేరుతోనూ మోసాలకు పాల్పడ్డారు. సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన వ్యక్తులను నమ్మి పంపిన చిత్రాలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్‌కు గురైన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇటీవల పెట్టుబడుల మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఒక లక్ష రూపాయల పెట్టుబడితో నెలకు ఐదు నుండి పది వేలు, రూ.5 వేలు వరకు పొందవచ్చని, ఏడాదికి రెట్టింపు ఆదాయమంటూ సైబర్ నేరగాళ్లు అనేక నకిలీ వెబ్‌సైట్ల ప్రకటనలతో అమాయకులను ఆకర్షించేయత్నం చేస్తున్నారు. పెళ్లి సంబంధాల వెబ్‌సైట్స్‌తో మోసపోయిన బాధితులున్నారు.

కర్నూలులోని కల్లూరు ముజఫర్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తికి అపరిచితుడి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. తమ సంస్థ లక్కీడ్రాలో మీ ఫోన్ నెంబరు ఎంపికైందని, కారు బహుమతిగా ఇస్తున్నట్లు చెప్పాడు. ఓ కారు చిత్రాన్ని పంపాడు. కారును త్వరలో డెలివరీ ఇస్తామని చెప్పేసరికి నిజమేనను కున్నాడు. తర్వాత ప్రాసెసింగ్ ఫీజు, ఆదాయపన్ను, రిజిస్ట్రేషన్ రుసుము పేరుతో మొత్తం రూ.47 వేలు ఖాతాలో జమ చేయించుకుని ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఓఎల్‌ఎక్స్‌లో ఓ అపరిచిత వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని విక్రయిస్తున్నట్లు ప్రకటన ఇచ్చి వాహనం చిత్రాన్ని ఉంచాడు. జిల్లాకు చెందిన ఓ యువకుడు నమ్మి అతనికి ఫోన్ చేయగా తాను మిలిటరీలో పనిచేస్తున్నానని, బదిలీ అయినందున విక్రయిస్తున్నట్లు చెప్పి నమ్మించాడు. అతని మాటలు నమ్మి కొంత మొత్తాన్ని అడ్వాన్సుగా ఖాతాలో జమచేశాడు. తర్వాత వాహనాన్ని ప్రముఖ ట్రాన్స్‌పోర్టు ద్వారా పంపుతున్నట్లు చిత్రాన్ని పోస్టు చేయటంతో నమ్మి మిగిలిన మొత్తం జమ చేశాడు. మొత్తం 80 వేలు రూపాయలు పంపిన అతడు సదరు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాన్ని సంప్రదించగా వాహనం రాలేదని చెప్పారు. అతనికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని రావటంతో మోసపోయినట్లు తెలుసుకున్నాడు.

నైజీరియాకు చెందిన సైబర్ నేరగాళ్లు ఎమ్మిగనూరుకు చెందిన ఓ వ్యక్తిని పరిచయం చేసుకున్నారు. యూకేలో నూనె వ్యాపారం చేస్తున్నట్లు నమ్మించారు. ముంబైలో ముడిసరకు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. తమది విదేశీ సంస్థ అయినందుకు ఎక్కువ పన్ను చెల్లిస్తున్నామని, భాగస్వామిగా చేరితే తక్కువ చెల్లించవచ్చని చెప్పారు. ఆయన ఏకంగా రూ.11.24 లక్షలు వారి ఖాతాలో డిపాజిట్‌చేసి మోసపోయారు. చదువులేని వాళ్ళు, పేదరికంలో ఉన్న వాళ్లే కాదు, ఉన్నత చదువు అభ్యసించి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న వాళ్ళు సైతం మోసపోతున్నారు. బిటెక్, ఎంబిఏ వంటి డిగ్రీలు ఉన్న వారు కూడా సరైన ఉపాధి లేక విలాసవంతమైన జీవితాలకు అలవాటుపడి నేరాలు ఎంత సులువుగా చేయాలి, ఎలా తప్పించుకోవాలి యూ ట్యూబ్, సినిమాలు ద్వారా తెలుసుకుని నేరాలకు పాల్పడుతున్నట్టు పోలీసు నిఘా లేదా సర్వేల ద్వారా తెలుస్తుంది.

పోలీసుల సూచనలు ఇవే

ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా, ఇతర వ్యక్తిగత వివరాలు అపరిచితులకు ఇవ్వరాదు. కొత్తకొత్త లింకులను క్లిక్ చేసి అందులో వ్యక్తిగత వివరాలు నమోదు చేయకూడదు. పాస్‌వర్డ్, ఓటీపీ, పిన్ నెంబరు ఇతర వివరాలు ఎట్టి పరిస్థితుల్లో ఇతరులకు చెప్పరాదు. పంపరాదు. లాటరీ తగిలిందని మెసేజ్ వచ్చినా, ఫోన్ చేసినా నమ్మరాదు. మెసేజ్‌లు ఆగిపోవడం, సిమ్ పనిచేయక పోవడం, సిగ్నల్స్ తగలకపోవడం, అవాంఛనీయ మెసేజ్‌లు రావడం సిమ్ స్వాప్‌కు సంకేతాలు. వెంటనే సంస్థ సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించాలి. లోన్ యాప్స్‌కు దూరంగా ఉండాలి. సైబర్ నేరానికి గురై ఆర్థికంగా నష్టపోయిన బాధితులు వెంటనే 1930 నెంబరుకు ఫోన్ చేయాలి. లేదంటే పోలీసులను సంప్రదించాలి.

వివిధ రకాల సైబర్ నేరాలు

గుర్తింపు దొంగతనం, ఓటీపీ మోసాలు, బ్యాంకుల పేరుతో మోసాలు, ఈ-మెయిల్స్ ద్వారా మోసాలు (సంస్థల నకిలీ ఈ-మెయిల్స్, లాటరీ, జాబ్ ఆఫర్స్), ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, రుణాలు ఇస్తామని యాప్‌లు, ఆన్‌లైన్ ద్వారా ప్రకటనల మోసాలు, డెబిట్, క్రెడిట్ కార్డుల మోసాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు. ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, సామాజిక మాధ్యమాల్లో మోసాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు. లాటరీ ఎస్‌ఎంఎస్‌లు, ఫోన్‌కాల్స్, స్పామ్‌కాల్స్.

సిమ్ స్వాప్ మోసాలు అంటే ఏంటి? వాటి బారిన పడకుండా ఎలా జాగ్రత్త పడాలి?

యువతులు, మహిళలకు సైబర్ బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ మోసాలు. ఆన్‌లైన్ షాపింగ్, ఒఎల్‌ఎక్స్ మోసాలు, యాప్‌లు ఇన్‌స్టాల్ చేసుకునేప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు. మెసేజ్, వాట్సప్ ద్వారా గుర్తు తెలియని లింకులు, పొంచి ఉన్న ప్రమాదం, హ్యాకింగ్ మోసం. విదేశాల్లో ఉంటూ నేరాలు చేసేవారు ఎలా చేస్తున్నారు? నేరగాళ్లకు వరంగామారిన ఇంటర్నెట్ కాల్స్, అడ్డుకట్ట వేసేందుకు పోలీసుల వ్యూహం ఏంటి? ఆ సాంకేతికత వీరి వద్ద ఉందా? ఈ-ఫైలింగ్, ఇన్‌కంటాక్స్ అప్రూవ్డ్ పేరిట మోసాలు? అడ్డుకట్ట ఎలా? తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి? సైబర్ టెర్రరిజం. వ్యక్తులను లక్ష్యంగా చేసుకునే సైబర్ పోర్నోగ్రఫీ, సైబర్ స్టాకింగ్. సైబర్ డిఫమేషన్. ఆస్తులను లక్ష్యంగా చేసుకునే ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్. మేథో సంపత్తి హక్కుల ఉల్లంఘన.

స్పూఫింగ్ అంటే ఏంటి? యువతలో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ. సైబర్ మోసాలపై యువతలో అవగాహన పెంచేందుకు ఆలిండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) నడుం బిగించింది. దేశవ్యాప్తంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో అన్ని జిల్లాల్లో సభలు, సమావేశాలు, సదస్సులు నిర్వహించనున్నాం. ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తాం. ఒకవేళ మోసపోతే ఎవరికి ఫిర్యాదు చేయాలి. సైబర్ నేరాలకు సంబంధించి అందుబాటులో ఉన్న చట్టాలపై యువతలో అవగాహన పెంచేందుకు కృషి చేస్తాం. ప్రతీ మండల రెవెన్యూ కార్యాలయం, పోలీసు స్టేషన్‌లో సైబర్ నేరాలకు సంబంధించి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

వ్యాస రచయిత ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి

సింగరేణి సహా బొగ్గు గనుల వేలం!

అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను, ఆస్తులను, భూములను మోదీ ప్రభుత్వం తెగనమ్ముతున్నది. బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెడుతున్నది. సింగరేణి బొగ్గు బ్లాకులు సహా 106 బ్లాకులను తాజాగా వేలం పెడుతున్నది. దేశంలో నెలకొన్న బొగ్గు కొరతతో 2020లో అనేక బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఉత్పత్తిని ఆపివేశాయి. ఫలితంగా తీవ్రమైన కరెంటు కొరత ఏర్పడి అనేక రంగాలు సంక్షోభంలో పడ్డాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియాను పటిష్టపర్చి బొగ్గు కొరతను నివారించే చర్యలు తీసుకోకుండా మోదీ ప్రభుత్వం బొగ్గు గనుల ప్రైవేటీకరణ ప్రారంభించింది. ఫలితంగా బొగ్గు కొరత పెరిగి, విద్యుత్ చార్జీలు పెరగడంతో ప్రజలపై విపరీతమైన ఆర్థిక భారం పడుతుంది. దేశంలో బొగ్గు కొరతకు పాలక ప్రభుత్వాలే కారణం. దేశంలో బొగ్గు సహజ వనరులు పుష్కలంగా ఉన్నాయి. మన అవసరాలకు తగినంత బొగ్గును ఉత్పత్తి చేసుకోవచ్చు. సమస్యల్లా ఉత్పత్తికి సంబంధించినది. సహజ వనరులను వెలికితీసి దేశ అవసరాలకు ఉపయోగించడంలో పాలకుల ఉద్దేశ పూరిత వైఫల్యం బొగ్గు కొరతకు కారణమైంది. దీనికి తోడు కృత్రిమ కొరత, దోపిడీ తోడైంది. భారతదేశంలో పారిశ్రామిక అవసరాలకు బొగ్గు వినియోగం పశ్చిమ బెంగాల్ లోని రాణిగంజ్‌లో ప్రారంభమైంది. ఈస్ట్ ఇండియా కంపెనీ 1774లో నారాయణకుడి ప్రాంతంలో మొదటిసారి బొగ్గు గనుల తవ్వకం చేపట్టింది. అప్పటికి దేశం పారిశ్రామికంగా బాగా వెనుకబడటంతో బొగ్గుకు డిమాండ్ లేని పరిస్థితి. భారతదేశంలో 1853లో తొలి పాసింజర్ రైలు అమల్లోకి రావడం, ఆవిరి ద్వారా నడిచే రైలు ఇంజన్లు ఉత్పత్తి కావటంతో బొగ్గు వినియోగం పెరిగింది. 20వ శతాబ్దంనాటికి దేశంలో బొగ్గు ఉత్పత్తి సంవత్సరానికి 61లక్షల టన్నులకు చేరింది. ప్రపంచవ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తి వినియోగంలో చైనా తర్వాత భారతదేశం రెండవ స్థానంలో ఉంది.

1973వ సంవత్సరంలో ప్రభుత్వం బొగ్గు గనులను జాతీయం చేసింది. అప్పటి నుంచి ప్రభుత్వ సంస్థలే అధిక శాతం బొగ్గును ఉత్పత్తి చేస్తున్నాయి. కోల్ ఇండియా సంస్థ 90శాతం బొగ్గును ఉత్పత్తి చేసింది. కొన్ని గనులను పెద్ద పెద్ద కంపెనీలకు కూడా ఇచ్చారు. ఆ సంస్థలు ఉత్పత్తిచేసే బొగ్గును తమ ప్లాంట్లలో మాత్రమే వినియోగిస్తారు. ప్రపంచంలో భూగర్భ బొగ్గు నిల్వలు ఉన్న దేశాలు అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా, చైనా, భారతదేశాలు. భారత దేశంలో 31,900 కోట్ల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని బొగ్గు మంత్రిత్వ శాఖ తెలిపింది. జార్ఖండ్, ఒడిశా, చత్తీస్‌గడ్, పశ్చిమ బెంగాల్, మధ్య ప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలలో అతిపెద్ద గనులు ఉన్నాయి. దేశంలోని సహజ బొగ్గు వనరులను ఉపయోగించక పోవటంతో బొగ్గు కొరత ఏర్పడి విదేశాల నుంచి అధిక ధరకు బొగ్గును దిగుమతి చేసుకుంటున్నాం. ముఖ్యంగా ఇండోనేసియా నుండి అత్యధికంగా బొగ్గు కొనుగోలు జరుగుతున్నది. ఇండోనేసియాలోని రెండు బొగ్గు గనుల్లో టాటా పవర్ వాటా 30శాతం కాగా, మరో గనిలో అదాని పవర్ కి 74శాతం వాటా ఉంది. రవాణా కోసం అదానీ స్వాధీనంలో పోర్టులు ఉన్నాయి. టాటా, అదానీల ప్రయోజనాల కోసం ఇండోనేసియా నుంచి మోదీ ప్రభుత్వం బొగ్గు దిగుమతి చేసుకుంటున్నది.

దేశంలో బొగ్గు ధరలు విపరీతంగా పెరిగాయి. టన్ను ధర 4,500 రూపాయల నుంచి 15,000 లకు పెరిగింది. దేశంలోని తీర ప్రాంతంలో ఉన్న బొగ్గు కర్మాగారాలు అత్యధికంగా బొగ్గును దిగుమతి చేసుకుంటున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పెరగటంతో ఈ ప్లాంట్లు మూత పడుతున్నాయి. 2020లో ఈ ప్లాంట్లు 54శాతం విద్యుత్ ఉత్పత్తి చేయగా, 2021లో 15శాతానికి పడిపోయింది. 2020-21లో సీఐఎల్ (కోల్ ఇండియా), సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ 64,07,017 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయగా, ప్రైవేట్ కంపెనీలు 24,280 మిలియన్ టన్నులు బొగ్గు మాత్రమే ఉత్పత్తి చేశాయి. సీఐఎల్ ఈ ఆర్థిక సంవత్సరంలోనే వివిధ పన్నుల పేర 44,07,581 కోట్లు కేంద్రానికి చెల్లించింది. 12,70,217 కోట్ల రూపాయలు నికర లాభం గడించింది. దీన్ని గమనిస్తే ప్రైవేట్‌సంస్థలు బొగ్గుఉత్పత్తి చేయకుండా కృత్రిమ కొరత సృష్టిస్తున్నాయి. "ఆత్మనిర్భర్ భారత్" స్ఫూర్తిగా వాణిజ్య పరంగా బొగ్గు గనులవేలం మొదటి విడతను మోదీ 2020లో ప్రారంభించారు. ఆత్మ నిర్భర్ భారత్ అంటే ప్రభుత్వరంగసంస్థలను వేలంవేయటం. 11-10-2021న కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ బొగ్గు గనుల వేలంపై ప్రకటన జారీ చేసింది. కోల్‌మైన్స్ స్పెషల్ ప్రొవిజన్ యాక్ట్ 2015, మైన్స్ మినరల్స్ యాక్ట్ 1957 మార్గదర్శకంగా దేశవ్యాప్తంగా 88 బొగ్గు గనులను వేలం వేస్తున్నట్లు ప్రకటించింది. దానికి అనుగుణంగా చట్టాలను సవరించారు. ప్రైవేట్ సంస్థల అంతిమ వినియోగంపై ఎటువంటి పరిమితులు లేకుండా బొగ్గు గనుల వేలాన్ని అనుమతించేందుకు ఈ గనుల నుంచి బొగ్గును సొంత వినియోగం, అమ్మకం లేదా మరేదైనా ప్రయోజనం కోసం ఉపయోగించవచ్చు. 6వ రౌండ్ వాణిజ్యం బొగ్గు గనుల కింద వేలం వేసిన 29 బొగ్గు గనులకు మంత్రిత్వశాఖ ఒప్పందంపై సంతకం చేసింది.

బొగ్గు గనుల మంత్రిత్వశాఖ 7వ రౌండ్ వాణిజ్య బొగ్గు గనుల వేలం ప్రక్రియను 29-3-23న ప్రారంభించింది. మొత్తం 106 బొగ్గు బ్లాకులు వేలం ఆఫర్‌లో ఉన్నాయి. వేలం వేస్తున్న గనులు బ్లాకులు జార్ఖండ్, ఛత్తీస్‌గడ్, ఒడిశా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, తమిళ నాడు, బిహార్ రాష్ట్రాలకు విస్తరించాయి. తెలంగాణ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ రామగుండం వచ్చిన సందర్భంలో సింగరేణి గనులను ప్రైవేటీకరిస్తున్నామన్నది అబద్ధం అని చెప్పారు. అందుకు విరుద్ధంగా వేలంలో సింగరేణి కాలరీస్‌కు చెందిన సత్తుపల్లి బ్లాక్ 3, శ్రావణపల్లి, పెనగడ గనుల బ్లాకులు వేలం ప్రక్రియ నోటీస్‌లో ఉన్నాయి.

దేశంలో తొలిప్రభుత్వరంగసంస్థగా సింగరేణి ఏర్పడింది. అధికారమార్పిడికి ముందే 1920డిసెంబర్ 23న 'సింగరేణి లిమిటెడ్' కంపెనీగామారింది. సింగరేణిది 130 సంవత్సరాల చరిత్ర. సింగరేణి గనుల్లో 51శాతం తెలంగాణ రాష్ట్రానిదికాగా, కేంద్రానిది 49 శాతం ఉంది. 1990లో రెండుసార్లు దాదాపు ఖాయిలా పడే పరిస్థితి ఏర్పడి తిరిగి నిలదొక్కుకుంది. బొగ్గు తవ్వకాలు ప్రారంభించిన 133 సంవత్సరాల్లో 1,550 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. నష్టాల నుంచి బయట పడి 1998 నుంచి లాభాల్లోకి వచ్చింది. కార్మికులకు బోనస్‌లు ఇచ్చింది. 12 వేల కోట్ల టర్నోవర్ నుంచి నేడు 26 వేల కోట్ల టర్నోవర్ చేరింది. 2019లో 11వందల కోట్ల లాభాలు గడించింది. ఇతర రాష్ట్రాల్లో కూడా బొగ్గు గనులు తీసుకుని తవ్వకాలకు సిద్ధ మౌతున్నది.

వేలంలో కాకుండా కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించాలని కోరినా కేంద్రం నిరాకరించింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, బొగ్గు గనుల మంత్రిత్వ శాఖల ప్రకారమే 4-8-2021 నాటికి విద్యుచ్ఛక్తి పంపిణీ సంస్థల నుంచి రావాల్సిన బకాయిలు 21 లక్షల కోట్లు. వీటిని రాబట్టేందుకు మోదీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. లాభాల్లో ఉన్న సంస్థలను కూడా ప్రైవేట్ సంస్థలపరం చేస్తున్నదన్న దానికి సింగరేణి కాలరీస్ సంస్థ నిదర్శనం. బొగ్గు గనుల ప్రైవేటీకరణ వలన నిరుద్యోగం పెరుగుతుంది. బొగ్గు నిల్వలు బడా కంపెనీల పరమై బొగ్గు ధర పెరగటమే కాకుండా కరెంట్ చార్జీలు విపరీతంగా పెరుగుతాయి. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రజలపై భారం మోపుతున్న మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశ ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉంది.

బొల్లిముంత సాంబశివరావు,
సెల్: 9885983526

ఓబీసీ కోటాపై బీజేపీ కుట్ర

- జవేరీ కమిషన్ నివేదిక వెల్లడించాలి
- జోక్యం చేసుకోవాలని గుజరాత్ గవర్నరుకు కాంగ్రెస్ వినతి

అహ్మదాబాద్: ఇతర వెనుకబడిన వర్గాల(ఓబీసీ) రిజర్వేషన్లపై నివేదికను బహిర్గతం చేయాలని గుజరాత్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. స్థానిక సంస్థల్లో ఓబీసీల రిజర్వేషన్ల స్థితిగతులకు సంబంధించిన కమిటీ నివేదికపై ప్రభుత్వం సమావేశం కావడంపై జోక్యం చేసుకోవాలని గవర్నరు ఆచార్య దేవవ్రతకు విజ్ఞప్తి చేసింది. పంచాయతీ ఎన్నికల్లో ఓబీసీ కోటా ఖరారుపై గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలోని చాలా స్థానిక సంస్థలకు ఐదేళ్లయినా ఇంకా ఎన్నికలు జరపలేదని కాంగ్రెస్ తెలిపింది. ఓబీసీ కోటా ఖరారు కోసం రాష్ట్ర ప్రభుత్వం కేఎస్ జవేరీ కమిషన్‌ను గతేడాది జులైలో ఏర్పాటు చేసిందని, కమిషన్ నివేదిక బహిరంగ పర్చలేదన్న సాకుతో ఎన్నికలో వాయిదా వేస్తోందని కాంగ్రెస్ విమర్శించింది. కాంగ్రెస్ సీనియర్ శాసనసభ్యులు అమిత్ చవదా, అర్జున్ మొద్వాడియా నాయకత్వంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల బృందం మంగళవారం గవర్నరును గాంధీనగర్‌లోని రాజ్‌భవన్‌లో కలిసింది. జవేరీ కమిషన్ నివేదికను బహిర్గతం చేయడంలో జోక్యం చేసుకోవాలని వినతిపత్రం అందజేసింది. ఓబీసీ రిజర్వేషన్ల సిఫార్సు ఆధారంగా ఎన్నికల ప్రకటనకు అవసరమైన సూచనలు చేయాలని కోరింది. మార్చి 12వ తేదీకే కమిషన్ గడువు ముగిసినప్పటికీ నివేదికను ప్రభుత్వం బహిరంగ పర్చలేదని, గుజరాత్‌ల ఓబీసీల రాజకీయ అస్తిత్వాన్ని దెబ్బతీసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ప్రతిపక్ష కాంగ్రెస్ విమర్శించింది. గవర్నరును కలిసిన అనంతరం రాజ్‌భవన్ వెలుపల చవదా విలేకరులతో మాట్లాడుతూ గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు వంటి స్థానిక సంస్థలలో గతంలో ఓబీసీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించారని చెప్పారు.

అయితే కుట్రలో భాగంగానే ఓబీసీల అస్తిత్వానికి ముగింపు పలికే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ నిరసనల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ జవేరీ కమిషన్ ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. ఇప్పటికీ కమిషన్ నివేదికను బయటపెట్టలేదని, ఓబీసీల రాజకీయ ప్రాతినిధ్యం ముగింపునకు జరుగుతున్న కుట్ర వెనుక ఎవరున్నారని చవదా ప్రశ్నించారు. కమిషన్ నివేదిక బయటికి రాకపోవడం వల్ల 7,100 గ్రామ పంచాయతీలు, రెండు జిల్లా పంచాయతీలు, 18 తాలూకా పంచాయతీలు, 75 మున్సిపాలిటీలు, పెద్దసంఖ్యలో ఖాళీ అయిన ఉప ఎన్నికలు నిలిచిపోయాయని వివరించారు. నిబంధనల ప్రకారం కమిషన్ నివేదిక విడుదల చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని, అందుకే నివేదికను బహిర్గతం చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు.

కమిషన్ సిఫార్సు ప్రకారం ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించాలని, సత్వరమే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని గవర్నరుకు విజ్ఞప్తి చేశామన్నారు.

బాబ్రీ విధ్వంసంలో మా పాత్ర లేదా?

షిండే రాజీనామా చేయాలి: ఉద్ధవ్

న్యూఢిల్లీ: మహారాష్ట్ర మంత్రి చంద్రకాంత్ పాటిల్ వ్యాఖ్యలపై శివసేన(యూబీటీ) నేత ఉద్ధవ్ థాక్రే తీవ్రంగా స్పందించారు. బాబ్రీ మసీదు విధ్వంసంలో శివసేన కార్యకర్త ఒక్కరూ పాల్గొనలేదని బీజేపీ మంత్రి చంద్రకాత్ పాటిల్ చెప్పడంపై ఉద్ధవ్ ఆగ్రహం వెలిబుచ్చారు. మంత్రి అనుచిత వ్యాఖ్యలకుగాను ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే రాజీనామా చేయాలి లేదా ఆ మంత్రిని కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని ఉద్ధవ్ డిమాండ్ చేశారు. మసీదును ధ్వంసం చేస్తున్న సమయంలో కొన్ని ఎలుకలు కన్నాల్లో దాక్కున్నాయని ఉద్ధవ్ ఆరోపించారు. ఉద్ధవ్ థాక్రే మంగళవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమ పార్టీ హిందుత్వ అంటే జాతీయవాదమని, బీజేపీ దృష్టిలో హిందుత్వ అంటే ఏమిటో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. శివసేన(ఉద్ధవ్) పార్టీ నేత సంజయ్‌రౌత్ కూడా ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ మంత్రి పాటిల్ వ్యాఖ్యలను షిండే ఆమోదిస్తున్నారా? ఒకవేళ ఆయన అంగీకరించకపోతే ముఖ్యమంత్రి పదవికి షిండే రాజీనామా చేయాలని పేర్కొన్నారు. పాటిల్ వ్యాఖ్యలపై ఏ మంత్రి రాజీనామా చేస్తారని నిలదీశారు. షిండే నాయకత్వంలోని 40 మంది శివసేన ఎమ్మెల్యేలు బాల్ థాక్రే అనుచరులేనా అని ప్రశ్నించారు. వివాదాస్పద స్థలంలోని మసీదు కూల్చివేతలో శివసైనికులు భాగస్వాములుగా ఉన్నందుకు గర్వంగా ఉందని బాల్ థాక్రే పదేపదే చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. బాబ్రీ మసీదు కూల్చివేత సమయంలో ఎలుకలన్నీ కలుగుల్లో దాక్కున్నాయని ఉద్ధవ్ ఎద్దేవా చేశారు.

టైట్లర్ వాయిస్ నమూనా సేకరించిన సీబీఐ

న్యూఢిల్లీ: సిక్కుల ఊచకోత కేసు నిందితుడు, కాంగ్రెస్ నేత జగదీశ్ టైట్లర్ వాయిస్ నమూనాను సీబీఐ మంగళవారం సేకరించింది. 1984లో పుల్ బంగాశ్ ప్రాంతంలో జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్లలో ముగ్గురు మృతి చెందిన విషయం విదితమే. సిక్కులను తాను చంపానని టైట్లర్ చెప్పినట్లుగా స్టింగ్ టేపులు విడుదల చేసిన రాజకీయ నేత మంజిత్ సింగ్ జీకేకు సీబీఐ సమన్లు జారీ చేసినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. ఈ కేసులో తాజా సాక్ష్యాల సేకరణలో సీబీఐ వేగం పెంచింది. సీబీఐ సేకరించిన వాయిస్ నమూనాతో గతంలోని స్టింగ్ టేపులను సరిపోల్చనున్నదని అధికారులు వివరించారు. సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసును నానావతి కమిషన్ విచారణ చేసిన విషయం విదితమే. టైట్లర్ ఇక్కడి సీజీఓ కాంపెక్స్‌లోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి వచ్చారు. ఇక్కడ నిపుణులు ఆయన వాయిస్ నమూనాను సేకరించారు.

దిబ్రూగఢ్ జైలుకు పాపల్‌ప్రీత్ సింగ్

దిబ్రూగఢ్(అసోం): అత్యంత భద్రత నడుమ ఖలిస్తాన్ వేర్పాటువాద నాయకుడు, 'వారిస్ పంజాబ్ దే' చీఫ్ అమృతపాల్ సింగ్ సన్నిహితుడు పాపల్‌ప్రీత్ సింగ్‌ను మంగళవారం దిబ్రూగఢ్ సెంట్రల్ జైలుకు తరలించారు. పాపల్‌ప్రీత్‌ను సోమవారం అమృత్‌సర్‌లోని కథు నంగల్ ప్రాంతంలో పంజాబ్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి విదితమే. జాతీయ భద్రతా చట్టం (ఎన్‌ఎస్‌ఏ) కింద పాపల్‌ప్రీత్‌ను అరెస్టు చేసినట్లు పంజాబ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీపీ) సుఖ్‌చైన్‌సింగ్ గిల్ మీడియాకు వివరించారు. పాపల్‌ప్రీత్ సింగ్‌అమృత్‌పాల్‌కు సహచరుడిగా ఉండటమే కాకుండా, ఆరు కేసులలో అతడి కోసం గాలిస్తున్నట్లు గిల్ చెప్పారు. అతనిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఆ రాజ్యసభ స్థానానికి

కొత్త అభ్యర్థిని ప్రకటిస్తాం: టీఎంసీ

కోల్‌కతా: రాజ్యసభ ఎంపీ పదవికి రాజీనామా చేసిన గోవా మాజీ ముఖ్యమంత్రి లూయిజిన్హో ఫలెరియో ఖాళీ చేసిన స్థానానికి కొత్త అభ్యర్థిని ప్రకటిస్తామని తృణమూల్ కాంగ్రెస్ తెలిపింది. కొన్ని నెలల క్రితమే ఆయనను రాజీనామా చేయాల్సిందిగా కోరామని, అయితే కొంత సమయం కావాలని కోరినట్లు టీఎంసీ వర్గాలు తెలిపాయి. 'మేము ఆయనకు మంచి ఆరోగ్యం, ఆనందం కలగాలని కోరుకుంటున్నాం... తన రాజ్యసభ స్థానానికి రాజీనామా చేయాల్సిందిగా పార్టీ ఆయన్ను కోరింది... పార్టీ నిర్ణయానికి ఆయన కట్టుబడటం మంచి విషయం' అని టీఎంసీ ఎంపీ శాంతాను సేన్ పీటీఐకి తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే ఆ స్థానానికి కొత్త అభ్యర్థిని పార్టీ ప్రకటిస్తుందని చెప్పారు. ఫలెరియోను ఎందుకు రాజీనామా చేయమని అడిగారనే ప్రశ్నపై వ్యాఖ్యానించడానికి సేన్ నిరాకరించారు. ఇది పార్టీ అంతర్గత విషయమని అన్నారు. అయితే విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం... పార్టీ నాయకత్వం మూడు నెలల క్రితమే ఫలెరియోను రాజీనామా చేయాలని కోరగా, ఆయన కొంత సమయం కోరారు. 'అతను రాజ్యసభ టిక్కెట్‌కి నామినేట్ అయినప్పుడు, అతను గోవాలో పార్టీకి సేవలందించాలని భావించారు. అతను దానిని చేయడంలో విఫలమయ్యారు కాబట్టి రాజీనామా చేయవలసిందిగా పార్టీ కోరింది' అని పేరు చెప్పడానికి ఇష్టపడని టీఎంసీ నాయకుడు చెప్పారు.

వయనాడ్‌లో రాహుల్‌కు జననీరాజనం

వయనాడ్: కేరళలోని తన నియోజకవర్గం వయనాడ్ పర్యటనకు వచ్చిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి మంగళవారం ఘనస్వాగతం లభించింది. జిల్లా సరిహద్దు కల్‌పెట్ట వద్దకు వేలాదిమంది యూడీఎఫ్ నాయకులు, కార్యకర్తలు వచ్చి రాహుల్‌కు నీరాజనం పట్టారు. రాహుల్ వెంట ఆయన సోదరి ప్రియాంకగాంధీ కూడా ఉన్నారు. ఎంపీగా అనర్హత వేటు పడిన తర్వాత రాహుల్ తాను ప్రాతినిధ్యం వహించిన వయనాడ్‌కు రావడం ఇదే మొదటిసారి. కల్‌పెట్ట నుంచి రాహుల్ రోడ్‌షో నిర్వహించారు. వేలాదిమంది యూడీఎఫ్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు రోడ్డుకు రెండు వైపులా నిలబడి జాతీయ జెండాలు ప్రదర్శించారు. సత్యమేవ జయతే బ్యానర్లు ప్రదర్శించారు. అన్ని వయస్సుల వారు రోడ్డుకు రెండువైపులా నిలబడి రాహుల్‌కు స్వాగతం పలికారు. ప్రియాంక, కేరళ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ట్రక్కులో వెళుతుండగా ప్రజలు నీరాజనం పలికారు. హెలికాప్టర్‌పై ఇక్కడికి వచ్చిన రాహుల్‌గాంధీ...ఇక్కడ నుంచి సభావేదిక వద్దకు ట్రక్కుపై రోడ్‌షోగా వెళ్లారు. రాహుల్‌గాంధీకి అనూహ్య మద్దతు లభించింది. రాహుల్ ప్రసంగం వినడానికి వేదికవద్ద ప్రజలు పెద్దసంఖ్యలో గుమికూడారు. రాహుల్ ఫొటోలు గల ప్లకార్డులు ప్రదర్శించారు. నేరపూరిత పరువునష్టం కేసులో రెండేళ్ల జైలు శిక్ష పడటంతో రాహుల్ లోకసభ సభ్యత్వంపై వేటుపడింది. రాహుల్ రోడ్‌షో పొడవునా కాంగ్రెస్ జెండాలకు బదులు జాతీయ పతాకాలు రెపరెపలాడాయి. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కేపీసీసీ అధ్యక్షుడు కె.సుధాకరన్, ముస్లిం లీగ్ రాష్ట్ర అధ్యక్షుడు పనక్కడ్ సయ్యిద్ సాదిఖ్ అలా షిహాబ్ తంగల్, కాంగ్రెస్ నేత తారిక్ అన్వర్, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ తదితరులు రాహుల్‌కు స్వాగతం పలికారు.

నిబంధనల ప్రకారమే పార్టీలకు హోదా: ఠాకూర్

బులంద్‌షహర్: నిబంధనల ప్రకారమే ఎన్నికల కమిషన్ పనిచేస్తుందని కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ చెప్పారు. రాజకీయ పార్టీలకు జాతీయ, ప్రాంతీయ హోదా కల్పించడం ప్రజా మద్దతు ఆధారంగా నిర్ణయిస్తుందని తెలిపారు. ఏ రాజకీయ పార్టీకి ప్రజల మద్దతు ఉంది లేదా క్రమేణా పార్టీల బలం ఎంత మేరకు తగ్గుతుంది వంటి అంశాల ప్రాతిపదికన జాతీయ హోదా, ప్రాంతీయ హోదా లభిస్తుందని వివరించారు. తృణమూల్ కాంగ్రెస్, ఎన్‌సీపీ, సీపీఐలకు జాతీయ హోదాను ఎన్నికల కమిషన్ సోమవారం రద్దు చేసింది. ఆమ్ ఆద్మీ పార్టీకి జాతీయ హోదా కల్పించింది. 'ఎవరికైతే ఓట్లు రావో...ఎవరికైతే ప్రజామోదం లభించదో...ఎవరికైతే క్రమంగా ఓట్ల బలం తగ్గుతుందో...అలాంటి పార్టీలపై నిబంధనల ప్రకారం ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంటుంది' అని ఠాకూర్ చెప్పారు. ప్రస్తుతం దేశంలో బీజేపీ, కాంగ్రెస్, బీఎస్‌పీ, సీపీఎం, ఎన్‌పీపీ, ఆప్‌లకు మాత్రమే జాతీయహోదా ఉంది. కర్నాటక ఎన్నికలపై స్పందిస్తూ ఆ రాష్ట్రంలో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమాగా చెప్పారు.

ఎన్నికలు ప్రకటించాకే వారికి

'జప్తు' అధికారం

బెంగళూరు: ఎన్నికలు ప్రకటించిన తర్వాతే సోదాలు చేసి సామగ్రిని జప్తు చేసే అధికారం ఎన్నికల అధికారులకు ఉంటుందని కర్నాటక హైకోర్టు స్పష్టం చేసింది. ఓ సామాజిక కార్యకర్త నుంచి స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలను వెంటనే అతనికి అప్పగించాలని ఆదేశించిన హైకోర్టు... ఈ మేరకు వివరణ ఇచ్చింది. ఇస్తియాక్ అహ్మద్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎం నాగప్రసన్న తన ఇటీవలి తీర్పులో... ఎన్నికల ప్రకటనకు ముందు ఏదైనా విషయాన్ని శోధించడానికి లేదా స్వాధీనం చేసుకోవడానికి రిటర్నింగ్ అధికారి లేదా ఎన్నికల అధికారులకు ఎటువంటి అధికార పరిధి లేదని పేర్కొన్నారు. ఎన్నికల ప్రకటనకు ముందు వారు ఆ అధికారాన్ని ఉపయోగించుకోలేరని స్పష్టం చేశారు. నగరంలోని శివాజీనగర్‌కు చెందిన అహ్మద్ అనే వ్యక్తి నివాసంలో 2023 మార్చి 19న శివాజీనగర్ రిటర్నింగ్ అధికారి 25 కిలోల చొప్పున ఉన్న 530 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. రిటర్నింగ్ అధికారి నోటీసుకు సమాధానం ఇచ్చినప్పటికీ బియ్యం బస్తాలు తిరిగివ్వలేదు. తాను సామాజిక కార్యకర్తనని, పండుగల సమయంలో నిరుపేదలకు బియ్యం పంపిణీ చేసేవాడినని తెలిపారు. తన వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని అందజేసేవాడినని పేర్కొన్నారు. అయితే ఎన్నికల సమయంలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించబోమని నష్టపరిహారం బాండ్ దాఖలు చేయాలని అహ్మద్‌ను కోర్టు ఆదేశించింది. అదే సమయంలో సీజ్ చేసిన బియ్యం బస్తాలను వెంటనే పిటిషనర్ కస్టడీకి విడుదల చేయాలని ప్రతివాదులకు మాండమస్ జారీ చేసింది. అయితే ఎన్నికలు ప్రకటించినందున తన వద్దనున్న బియ్యాన్ని పంపిణీకి వినియోగించరాదని షరతు విధించింది. ఈ మేరకు కోర్టుకు అఫిడవిట్ సమర్పించాలని కూడా పిటిషనర్‌ను ఆదేశించింది.

దేశ ప్రగతిని అడ్డుకునే శక్తులన్నీ ఆప్‌నకు వ్యతిరేకం

- పార్టీకి జాతీయ హోదా అద్భుతమైన విజయం
- పెద్ద బాధ్యతనూ తీసుకువచ్చింది
- దేశాన్ని నంబర్ వన్‌గా మార్చేందుకు కృషి చేస్తాం
- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

న్యూఢిల్లీ : దేశ ప్రగతిని అడ్డుకోవాలనుకునే 'దేశ వ్యతిరేక శక్తులన్నీ' ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కి వ్యతిరేకంగా ఉన్నాయని ఆ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం అన్నారు. 10 సంవత్సరాల స్వల్ప వ్యవధిలో జాతీయ పార్టీగా ఆప్ కొత్తగా సంపాదించిన హోదాను 'అద్భుతమైన, నమ్మశక్యం కాని' విజయంగా అభివర్ణించిన కేజ్రీవాల్, దానితో పాటు భారీ బాధ్యతను కూడా తీసుకువచ్చిందని చెప్పారు. భారతదేశాన్ని ప్రపంచంలోనే నంబర్ వన్ దేశంగా మార్చేందుకు ఆప్‌లో చేరాలని ప్రజలను కోరారు. ఇక్కడ పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద ఆయన ప్రసంగిస్తూ, ఇది ఆప్ సిద్ధాంతాన్ని గుర్తుంచుకోవలసిన సమయమని అన్నారు. ఆప్ సిద్ధాంతం మూడు స్తంభాలు... నిజాయితీ, దేశభక్తి, మానవత్వంపై ఆధారపడి ఉందని తెలిపారు. ఆప్ ఎదుగుదలకు సహకరించి, జాతీయ పార్టీ హోదా సాధించడంలో సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం జైలులో ఉన్న తన పార్టీ సహచరులు మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్‌ను గుర్తు చేసుకున్నారు. అవసరమైతే జైలుకు వెళ్లడానికైనా సిద్ధం కావాలని ఆప్ వలంటీర్లకు కేజ్రీవాల్ హితవు పలికారు. దీనికి భయపడే వారు పార్టీని వీడాలని అన్నారు. 'నా ప్రతి రక్తపు బొట్టు దేశం కోసం చిందిస్తే నేను అదృష్టవంతుడిని' అని కేజ్రీవాల్ అన్నారు.

దేశ రాజకీయాల్లో సానుకూల మార్పు తీసుకురావడంలో ఆప్ విజయం సాధించిందని, ఎన్నికల్లో నిజాయితీగా ఎలా గెలవాలో ఆ పార్టీ ఇతరులకు చూపించిందని అన్నారు. 'దేశంలో 1,300 రాజకీయ పార్టీలు ఉన్నాయి. వాటిలో ఆరు మాత్రమే జాతీయ పార్టీ హోదాను అనుభవిస్తున్నాయి. కేవలం బీజేపీ, కాంగ్రెస్, ఇప్పుడు ఆప్ ఒకటి. తమ పార్టీకి ఎక్కువ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఉన్నాయి' అని కేజ్రీవాల్ గుర్తు చేశారు. ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చేలా ఇతర రాజకీయ పార్టీలను ఆప్ ఒత్తిడి చేసిందని ఆయన అన్నారు. 'ఉచిత కరెంటు ఇస్తామని వాగ్దానం చేయడం మొదలు పెట్టారు. అయితే అలా చేయడం లేదు.

వాళ్లను కూడా అలాగే చేసేలా చేస్తాం' అని ఢిల్లీ ముఖ్యమంత్రి తెలిపారు. దేశంలో సానుకూల రాజకీయాలు చేసిన ఘనత ఆప్‌కే దక్కుతుందని, నిజాయితీతో మాత్రమే విజయవంతమైన ప్రభుత్వాన్ని నడపగలమని అన్నారు.

సంబరాల్లో పార్టీ శ్రేణులు

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీకి జాతీయ పార్టీ హోదా రావడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. మంగళవారం న్యూఢిల్లీలోని పార్టీ కార్యాలయం ఆవరణను పూలు, బెలూన్లతో అలంకరించడంతో ఉత్సాహభరితమైన రూపాన్ని సంతరించుకుంది. పార్టీ కార్యకర్తలు జాతీయ పార్టీ హోదా ఘనతను జరుపుకోవడానికి డ్రమ్స్ దరువులకు నృత్యం చేశారు. ఆప్ నాయకులు, కార్యకర్తలు డీడీయూ మార్గ్ వద్ద గుమిగూడారు. వీధులను పసుపు, నీలం రంగు బెలూన్లు, పార్టీ జెండాలతో అలంకరించారు. దేశభక్తి గీతాలు వినిపించారు. ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో మహిళా కార్యకర్తలు హాజరుకాగా, పార్టీ ఇతర సభ్యులు మిఠాయిలు పంచారు.

వచ్చే ఎన్నికల్లో 300కి పైగా స్థానాలు గెలుస్తాం: అమిత్ షా

దిబ్రూఘర్ : వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 300కు పైగా లోకసభ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో మళ్లీ అధికారంలోకి వస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం తెలిపారు. దిబ్రూఘర్‌లో జరిగిన ర్యాలీని ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఈశాన్య రాష్ట్రంలోని 14 లోక్‌సభ స్థానాలకు గాను కాషాయ పార్టీ 12 స్థానాల్లో విజయం సాధిస్తుందని బీజేపీ నాయకుడు విశ్వాసం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌పై తీవ్ర దాడిని ప్రారంభించిన షా, 'ఈశాన్య ప్రాంతం ఒకప్పుడు కాంగ్రెస్‌కు కోటగా పరిగణించబడేది. అయితే రాహుల్ గాంధీ యాత్ర (భారత్ జోడో యాత్ర) ఉన్నప్పటికీ, ఈ ప్రాంతంలోని మూడు రాష్ట్రాలలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ మంచి పనితీరు కనబరచలేకపోయింది' అని అన్నారు. మేఘాలయ, త్రిపుర, నాగాలాండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. త్రిపురలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, మిగిలిన రెండు రాష్ట్రాల్లో కూటమి భాగస్వాములుగా అధికారంలోకి వచ్చింది. రాహుల్ గాంధీ బ్రిటన్ పర్యటన సందర్భంగా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, 'అతను (గాంధీ) విదేశీ నేల నుంచి భారతదేశాన్ని అవమానించాడు. ఆయన ఇలాగే కొనసాగితే ఈశాన్య ప్రాంతంలోనే కాకుండా దేశం మొత్తం కూడా కాంగ్రెస్‌కు తెల్లారుతుంది. ప్రధాని నరేంద్ర మోదీని ఎంతగా దూషిస్తారో, బీజేపీ అంతగా అభివృద్ధి చెందుతుంది' అని తెలిపారు. వివాదాస్పద సాయుధ దళాల (ప్రత్యేక అధికారాలు) చట్టం, 1958 లేదా ఏఎఫ్‌ఎస్‌పీఏ అసోంలోని 70 శాతం ప్రాంతం నుంచి తొలగించామని, బోడోలాండ్, కర్బీ అంగ్లాంగ్ ప్రాంతాలు శాంతియుతంగా ఉన్నాయని, దాని పొరుగు రాష్ట్రాలతో రాష్ట్ర సరిహద్దు వివాదాలు పరిష్కారమవుతున్నాయని కేంద్ర హోం మంత్రి చెప్పారు.

చిట్టెలుక చిత్రవధ... వ్యక్తిపై 30 పేజీల చార్జిషీట్

బుదాన్: గతేడాది నవంబర్‌లో ఎలుక తోకకు రాయిని కట్టి కాలువలో ముంచి చంపిన వ్యక్తిపై యూపీ పోలీసులు బుదాన్ కోర్టులో 30 పేజీల చార్జిషీట్‌ను దాఖలు చేశారు. ఫోరెన్సిక్ రిపోర్టు, మీడియాలో వచ్చిన వీడియోలు, వివిధ విభాగాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా చార్జిషీట్‌ను సిద్ధం చేసినట్లు సర్కిల్ ఆఫీసర్ (నగరం) అలోక్ మిశ్రా పీటీఐకి తెలిపారు. చార్జిషీట్‌ను బలపరిచేందుకు పోస్ట్‌మార్టం పరీక్ష నివేదికను ఆధారంగా చేసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. చిట్టెలుకకు ఊపిరితిత్తులు కాలేయం ఇన్ఫెక్షన్ ఉందని, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగా ఊపిరాడక చనిపోయిందని నివేదిక సూచించింది. కాగా నవంబర్ 25న మనోజ్ కుమార్ ఎలుక పట్ల క్రూరత్వానికి పాల్పడ్డాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. కుమార్ ఎలుక తోకకు రాయిని కట్టి కాలువలోకి విసిరినట్లు జంతు సంరక్షణ కార్యకర్త వికేంద్ర శర్మ తమకు ఫిర్యాదు చేసిన్ల పోలీసులు తెలిపారు. ఎలుకను కాపాడేందుకు తాను కాలువలోకి దిగినప్పటికీ అది చనిపోయిందని శర్మ పేర్కొన్నారు.

మంగళవారం సీనియర్ న్యాయవాది రాజీవ్ కుమార్ శర్మ పీటీఐతో మాట్లాడుతూ... 'జంతువులపై క్రూరత్వ నిరోధక చట్టం ప్రకారం నిందితునికి రూ. 10 నుంచి రూ. 2వేల వరకు వరకు జరిమానా , మూడేళ్ల జైలు శిక్ష విధించవచ్చు...ఐపీసీ సెక్షన్ 429 ప్రకారం... ఐదేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించే నిబంధన ఉంది' అని వివరించారు. కానీ మనోజ్‌కుమార్ తండ్రి మధుర ప్రసాద్ మాత్రం ఎలుకలు, కాకులను చంపడం తప్పు కాదు...ఇవి హానికరమైన జీవులని చెప్పారు. 'ఎలుకలు మట్టితో తయారు చేసిన పాత్రలను పాడుచేసి మట్టి దిబ్బలుగా మార్చాయి. దీంతో అతడికి మానసిక, ఆర్థిక సమస్యలు ఎదురయ్యాయి. నా కొడుకుపై చర్యలు తీసుకుంటే మేకలు, కోడిగుడ్లు, చేపలు వేటాడే వారిపై కూడా చర్యలు తీసుకోవాలి. ఎలుకలను చంపే రసాయనాన్ని విక్రయించే వారిపై కూడా చర్యలు తీసుకోవాలి'అని ప్రసాద్ తెలిపారు. నవంబర్‌లో జరిగిన సంఘటన తర్వాత, ఎలుక మృతదేహాన్ని శవపరీక్ష కోసం బుదాన్‌లోని వెటర్నరీ ఆసుపత్రికి పంపారు.

కాని సిబ్బంది దానిని పరిశీలించడానికి నిరాకరించారు. అనంతరం మృతదేహాన్ని బరేలీలోని ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐవీఆర్ఐ)కి పంపించారు. కుమార్‌ను విచారణ నిమిత్తం పోలీసు స్టేషన్‌కు పిలిచారు. ఆ తర్వాత అతడిపై ఐపీసీ సెక్షన్ 429 (జంతువును వధించడం) కింద, జంతు హింస నిరోధక చట్టం కింద కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆ తర్వాత ఫోరెన్సిక్ పరీక్షలో ఎలుక ఊపిరితిత్తులు వాచిపోయి ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగా చనిపోయిందని తేలింది. ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ వల్ల ఊపిరి ఆడక ఎలుక చనిపోయిందని నిపుణులు నిర్ధారించినట్లు ఐవీఆర్ఐ జాయింట్ డైరెక్టర్ కేపీ సింగ్ చెప్పారు.

గ్యాంగ్‌స్టర్-రాజకీయవేత్తగా మారిన

అతిక్ అహ్మద్‌పై దోపిడీ కేసు

ఆయన కుమారుడిపై కూడా...

ప్రయోగ్‌రాజ్ : గ్యాంగ్‌స్టర్ నుంచి రాజకీయ నాయకుడిగా మారిన అతిక్ అహ్మద్, అతని కుమారుడిపై దోపిడీకి సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసినట్లు మంగళవారం ఒక అధికారి తెలిపారు. గుజరాత్‌లోని సబర్మతి సెంట్రల్ జైలులో ఉన్న అతిక్ అహ్మద్‌ను వేరే కేసుకు సంబంధించి కోర్టులో హాజరుపరిచేందుకు ఉత్తరప్రదేశ్ పోలీసులు ప్రయాగ్‌రాజ్‌కు తీసుకువస్తున్నారు. 2005లో బీఎస్పీ రాజు పాల్ హత్యలో ప్రత్యక్ష సాక్షి ఉమేష్ పాల్ హత్య కేసులో ఆయనతో పాటు అతని కుటుంబ సభ్యుల ప్రమేయం కూడా ఉందని ఆరోపణలు ఉన్నాయి. సోమవారం ధూమంగంజ్ పోలీస్ స్టేషన్‌లో తాజా కేసు నమోదయిందని అధికారి తెలిపారు. సాబీర్ హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అతిక్ అహ్మద్, అతని కుమారుడు అలీ, అసద్ కాలియా, షకీల్, షకీర్, సబీ అబ్బాస్, ఫైజాన్, సైఫ్, నమీ, అఫ్వాన్, మహమూద్, మౌద్, అస్లాం మంత్రి (అతిఖ్ కజిన్) లపై కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ పోలీస్ కమిషనర్ (నగరం) దీపక్ భుకర్ తెలిపారు. ఐపీసీ సెక్షన్లు 147 (అల్లర్లకు శిక్ష), 148 (అల్లర్లు, మారణాయుధాలతో ఆయుధాలు), 307 (హత్యకు ప్రయత్నించడం), 386 (చావు భయంతో ఒక వ్యక్తిని తీవ్రంగా గాయపరిచి దోపిడీ చేయడం) తదితరాల కింద కేసు నమోదయింది. తన ఫిర్యాదులో సాబీర్ హుస్సేన్, ఫిబ్రవరి 15, 2023 న, రాత్రి 7.30 గంటలకు, అతిక్ కజిన్ అస్లాం మంత్రి, అసద్ కాలియా నా ఇంటికి వచ్చి, అతిక్ 'భాయ్' నన్ను గుజరాత్‌కు పిలిచారని నాకు చెప్పారు. నేను వారితో వెళ్లడానికి నిరాకరించడంతో వారు నాపై దుర్భాషలాడారు, నన్ను కొట్టారు. లక్ష రూపాయలు డిమాండ్ చేశారు. చెల్లించకపోతే చంపేస్తామని బెదిరించారు. దీనికి ముందు, ఏప్రిల్ 14, 2019న, అలీ (అతిక్ కుమారుడు), అసద్ కలియా, షకీల్, షకీర్, సబీ అబ్బాస్, ఫైజాన్, సైఫ్, నమీ, అఫ్వాన్, మహమూద్, మౌద్, అస్లాం మంత్రి (అతిక్ బంధువు) అతిక్‌తో నన్ను ఫోన్‌లో మాట్లాడాలని కోరారు. వారు కోటి రూపాయలు కూడా డిమాండ్ చేశారు' అని పేర్కొన్నాడు. కొన్ని రోజుల క్రితం, ఉమేష్ పాల్ హత్యతో సంబంధం ఉన్న అతిక్ అహ్మద్, అతని భార్య షైస్తా పర్వీన్, కుమారుడు అలీపై పోలీసులు ఫోర్జరీ కేసు నమోదు చేశారు. ఉమేష్ పాల్, అతని ఇద్దరు పోలీసు సెక్యూరిటీ గార్డులను ఫిబ్రవరి 24న ప్రయాగ్‌రాజ్‌లోని ధూమన్‌గంజ్‌లోని అతని ఇంటి వెలుపల కాల్చి చంపారు.

సూరీడు భగ భగ

- రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- మరో ఐదు రోజులు ఎండ తీవ్రత: ఐఎండీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సూరీడు నిప్పులు చెరుగుతున్నాడు. రాష్ట్రంలో గత రెండు రోజులుగా భానుడి భగభగలు తారాస్థాయికి చేరాయి. రాష్ట్రవ్యాప్తంగా రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్లోనే సూర్యుడు ఈ స్థాయిలో తన ప్రతాపం చూపిస్తుండటంతో ఇక మే నెల రోహిణీ కార్తెలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సాధారణంగా ఈ నెలలో ఉండాల్సిన ఉష్ణోగ్రతల కన్నా ప్రస్తుతం ఎండ తీవ్రత మరీ ఎక్కువగా ఉంటోంది. ఒక్కో ప్రాంతాన్ని బట్టి సాధారణ డిగ్రీల కన్నా రెండు నుంచి 4 డిగ్రీలు వరకు ఎక్కువగా నమోదు అవుతున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. సహజంగా వేసవిలో అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే మంగళవారం రెంటచింతలలో 42.6 డిగ్రీలు నమోదు కాగా, నెల్లిమర్ల లో 41 .9 డిగ్రీలు, రాజాంలో 41 .8 డిగ్రీలు, కర్నూల్ 41 .5 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అడ్డతీగల, నెల్లిపాక, చింతూరు, గంగవరం, నర్సీపట్నం, మాకవరపాలెంతో పాటు సుమారు 26 మండలాల్లో ఎండల తీవ్రతతో పాటు వడగాడ్పులు వీచినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరగనున్నాయని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. ఎండ తీవ్రత ఒక్కసారిగా పెరగడంతో స్కూళ్లకి వెళ్లే పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నప్పటికీ, మధ్యాహ్నం వేళ విద్యార్థులు ఇంటికి చేరడానికి ఇబ్బంది పడుతున్నారు. వారికోసం స్కూళ్లకి వస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు కూడా గ్రీష్మతాపానికి అల్లాడుతున్నారు. ఏదైనా అత్యవసరం అయితేనే బయటకు వెళ్లాలని, వెళ్లినా సరైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇక మండే ఎండలకు సాధారణ ప్రజలు కూడా రోడ్లపైకి రావడానికి భయపడుతుండడంతో బేరాల్లేక వ్యాపార సంస్థలు వెలవెల బోయే పరిస్థితి ఏర్పడింది. నగరాల్లో నిత్యం రద్దీగా ఉండే వీధులు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రజలు డీహైడ్రేషన్‌కి గురి కాకుండా నీటిని ఎక్కువగా తాగుతుండాలని వైద్యాధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. కొబ్బరి బొండాలు, పండ్ల రసాలు తాగుతూ ఉండాలని చెబుతున్నారు. ఇంట్లో ఉన్నప్పుడు కూడా వేడి తగలకుండా చల్లగా ఉండేందుకు ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచిస్తున్నారు. మరోవైపు రానున్న ఐదురోజుల పాటు దేశవ్యాప్తంగా కూడా పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరుగన్నాయని భారత వాతావరణశాఖ (ఐఎండీ) వెల్లడించింది. దేశంలోని పశ్చిమ, మధ్య, తూర్పు ప్రాంతాలతోపాటు వాయువ్యంలోని కొన్ని చోట్ల 2 నుంచి 4 డిగ్రీ సెంటీగ్రేడ్ ల వరకు ఉష్ణోగ్రతలు పెరుగుతాయని ఐఎండీ తెలిపింది. రాబోయే రెండు రోజుల్లో మధ్యప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర , చత్తీస్‌గఢ్ లలో ఉరుములతో కూడిన జల్లులు కురుస్తాయని, బలమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. రాష్ట్రంలో వడగాలులు వీస్తున్నట్లు పేర్కొంది.

బీసీల కులగణనకు సీఎం జగన్ చొరవ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం వైఎస్ జగన్... బీసీ కులగణనకు కార్యాచరణ అధ్యయన కమిటీ వేయటం ముదావహమని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. భారత సామాజిక విప్లవోద్యమ పిత మహాత్మా జ్యోతిబా పూలే 197వ జయంతి వేడుకలను విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. తొలుత మంత్రులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు కళాక్షేత్రం వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి చెల్లుబోయిన మాట్లాడుతూ... రాష్ట్రంలో 139 బీసీ కులాలున్నప్పటికీ వారి సంఖ్య తెలియని పరిస్థితి నెలకొందన్నారు. బీసీ సంఘాల అభ్యర్థన మేరకు సీఎం జగన్ జనగణనలో బీసీ కులగణన చేయాలని సంకల్పించి బీసీ మంత్రిగా ఆ బాధ్యతను నాపై ఉంచారని తెలిపారు. బీసీ కులగణనకు అవసరమైన కార్యాచరణ అధ్యయన కమిటీని ఏర్పాటు చేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తమ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని స్పష్టం చేశారు. గృహ నిర్మాణ శాఖమంత్రి జోగి రమేశ్ మాట్లాడుతూ దేశంలో పూలే ఆశయాలను, ఆలోచనను పూర్తిగా అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.